ప్రజాశక్తి
గురువారం 30 నవంబర్ 2023 8 పేజీలు
ప్రకాశం బాపట్ల

నకిలీ టీసీల అరెస్టు

- చీరాల రైల్వేస్టేషన్లో అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ముగ్గురి వద్ద నుంచి నకిలీ ఐడి కార్డులు స్వాధీనం

అరెస్టయిన నకిలీ టీసీలు

ప్రజాశక్తి-చీరాల

టిక్కెట్ లేని ప్రయాణికులను బెదిరించి.. వారి వద్ద అందినకాడికి దండుకుంటున్న ముగ్గురు నకిలీ టీసీలను రైల్వే పోలీసులు మంగళవారం రాత్రి అరెస్టు చేశారు. తెలంగాణా రాష్ట్రం, వరంగల్ జిల్లా గొడ్లకొండ గ్రామానికి చెందిన బనోత్ కళ్యాణ్, మహబూబాద్ జిల్లా, నెల్లికుదూర్ మండలానికి చెందిన బాధవత్ ప్రవీణ్, వరంగల్ జిల్లా, పార్వతిగిరికి చెందిన గుగులోత్ గణేష్ కొంతకాలంగా నకిలీ ఐడి కార్డులు, టీసీ డ్రస్, నకిలీ చార్టులతో రైళ్లలో తిరుగుతూ.. టిక్కెట్ లేని ప్రయాణికుల నుంచి అధిక మొత్తంలో డబ్బులు గుంజుతున్నారు. ఈ నేపథ్యంలో చీరాల రైల్వేస్టేషన్‌లో ఈ ముగ్గురూ అనుమానాస్పదంగా తిరుగుతుండగా స్థానిక టీసీ రాజేష్ గుర్తించారు. వీరిపై రైల్వేపోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఈ ముగ్గురు యువకులనూ అదుపులోకి తీసుకొని విచారించారు. పూరి ఎక్స్‌ప్రెస్‌తో పాటు పలు రైళ్లలో వీరు ప్రయాణికులను బెదిరించి.. డబ్బులు వసూలు చేసినట్లు తెలిసింది. వీరికి నకిలీ ఐడి కార్డులు ఇచ్చిన వ్యక్తి ఎవరు? ఎంత కాలం నుండి టిసిల ముసుగులో ఎంత మొత్తంలో నగదును వసూలు చేశారనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. రైల్వే ఎస్సై కొండయ్య కేసు నమోదు చేశారు. వారి వద్ద నుండి నకిలీ ఐడీ కార్డులు స్వాధీనం చేసుకున్నారు.

'కంది'కి తెగుళ్ల బెడద

- పురుగు ఆశించడంతో తీవ్ర నష్టం
- ఆందోళనలో అన్నదాతలు

కంది పంటలో పురుగు పట్టిన దృశ్యం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో గల యర్రగొండపాలెం నియోజకవర్గంలో ఖరీఫ్‌లో వర్షాధారం కింద సాగు చేసిన కందిపంట పూత, పిందె, కాయ దశల్లో ఉంది. ఈ ఏడాది సాధారణ సాగు కంటే విస్తీర్ణం కొంత మేరకు పెరిగింది. కానీ ఏ పంటా రైతుకు దక్కలేదు. కంది పంటపై ఆశలు పెట్టుకున్న తరుణంలో వర్షాభావం వెంటాడుతోంది. పంటకు పురుగు ఆశించి తీవ్ర నష్టం కలిగించింది. ఒకవైపు బెట్ట పరిస్థితులు, మరోవైపు ఆశించిన పురుగును అదుపు చేసేందురు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ సమయంలో రైతులకు సూచనలు, సలహాలు కరవయ్యాయి. వ్యవసాయశాఖలో గ్రామ, మండల, డివిజన్ స్థాయి అధికారులు ఉన్నారు. ఏ ఒక్కరూ కూడా పొలంబాట పట్టడం లేదు. కార్యాలయాలు వదిలి బయటకు వెళ్లడం లేదు. డీలర్లను ఆశ్రయించి పురుగు నివారణకు మందులు కొనుగోలు చేసి రసాయన మందులు పిచికారీ చేయాల్సి వస్తోందని అన్నదాతలు వాపోతున్నారు. అయినా పురుగు ఉధతి తగ్గకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

యర్రగొండపాలెం నియోజకవర్గంలోని యర్రగొండపాలెం మండలంలో 1491 హెక్టార్లు, పుల్లలచెరువు మండలంలో 2418 హెక్టార్లు, త్రిపురాంతకం మండలంలో 7745 హెక్టార్లు, పెద్దదోర్నాల మండలంలో 158 హెక్టార్లు, పెద్దారవీడు మండలలంలో 750 హెక్టార్లు చొప్పున పంట సాగైంది. పంటలను సాగు చేసుకునేందుకు సేద్యం, విత్తనం, నాటడం, తెగుళ్ల ఉదృతికి మందులు పిచికారి చేయడానికి ఇలా మొత్తం పెట్టుబడి రూపంలో ఎకరాకు రూ.25 వేలు చొప్పున పెట్టుబడి పెట్టారు. అయినా వర్షాభావం, పురుగు ఆశించడంతో పంట చేతికి అందే పరిస్థితి లేదు.

తెగుళ్ల ఉధృతి..

ప్రధానంగా కంది పంటకు మారుకా మచ్చలు, కాయ తొలుచు పురుగు, ఎండు తెగులు, వెర్రి తెగులు ఆశించాయి. వాటిలో మచ్చల పురుగు ఉద్ధతి ఎక్కువగా ఉంది. రైతులు తీవ్రంగా ▶ 2లో

పెట్టుబడంతా నేలపాలు

బాశం లక్ష్మిరెడ్డి, రైతు, మురారిపల్లి

ఐదెకరాల్లో ఏక పంటగా కంది సాగు చేశా. పిందె దశలో ఉంది. కంది పంట దిగుబడి వస్తుందని ఆశలు పెట్టుకున్నా. ఈ సమయంలో వర్షం జాడలేక ఎండుతోంది. మరోవైపు మచ్చల పురుగు ఎక్కువ ఆశించింది. మూడుసార్లు రూ.15 వేలు వెచ్చించి, రసాయన పురుగు మందులను పిచికారి చేశా. అయినా అదుపులోకి రాలేదు. పంట చేతికందే ఆశలు వదులుకున్నా. పెట్టుబడంతా నేలపాలైంది.

నెమ్మదిగా రిజిస్ట్రేషన్లు.!

- నూతన విధానంతో తగ్గిన క్రయవిక్రయాలు
- కార్డు ప్రైమ్ 2.0 విధానంతో జిల్లా మొత్తం రోజుకు 30 లోపే రిజిస్ట్రేషన్లు
- ఉపాధికి దెబ్బ కొడుతుందని దస్తావేజు లేఖరుల ఆందోళన

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

ఉపాధి కోల్పోయి తమంత రోడ్డున పడతామని దస్తావేజుల్లేఖరులు ఆందోళన చేసినా.. అసలు పత్రాలు ప్రభుత్వం వద్ద పెట్టుకొని నకళ్లు.. అది కూడా పలుచని తెల్లటి కాగితాలు ఇవ్వడం ఏంటని ప్రజలు, ప్రతిపక్షాలు ప్రశ్నించినా కార్డు ప్రైమ్ టౌన్ జీరో విధానంపై రాష్ట్ర ప్రభుత్వం ముందుకే వెళుతోంది. గత సెప్టెంబర్ ఒకటి నుంచి ఈ విధానాన్ని అమలు చేయాలని తొలుత ప్రభుత్వం నిర్ణయించింది దస్తావేజు లేఖరుల ఆందోళనకు పాటు ప్రతి పక్షాల నుంచి వచ్చిన విమర్శలు నేపథ్యంలో కాస్తంత విరామం ఇచ్చింది. తాజాగా జిల్లాల వారీగా ఈ ప్రక్రియ ప్రారంభిస్తూ వస్తున్నారు. ప్రకాశం జిల్లావ్యాప్తంగా ఈనెల 21 నుంచి కార్డు ప్రైమ్ 2.0 విధానంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ ప్రక్రియ కారణంగా రిజిస్ట్రేషన్లు చాలా నిదానంగా జరుగుతున్నాయి.

అన్ని చోట్ల నిదానమే..

పూర్తిగా కొత్త సాంకేతిక పరిజ్ఞానం కావడంతో తొలి రెండు రోజులు జిల్లాలోని 12 సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో, ఒక జిల్లా రిజిస్టర్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు చాలా నెమ్మదిగా జరిగాయి. మార్కాపురం సబ్‌రిజిస్టర్ కార్యాలయంలో రోజుకు సగటుకు 20 నుంచి 30 వరకు రిజిస్ట్రేషన్లు గతంలో చేసేవారు. కానీ కార్డు ప్రైమ్ 2.0 విధానం మంగళవారం నుండి ప్రకాశం జిల్లాలో అమలుకావడంతో జిల్లావ్యాప్తంగా ఉన్న 12 సబ్ రిజిస్టార్ కార్యాలయాల్లో కేవలం 33 దస్తావేజులు మాత్రమే రిజిస్ట్రేషన్ అయ్యాయి. ఒక మార్కాపురం సబ్ రిజిస్టర్ కార్యాలయంలొ కేవలం ఒక్కటంటే ఒక్క దస్తావేజు మాత్రమే రిజిస్టర్ కావడం గమనార్హం. జిల్లావ్యాప్తంగా అన్ని చోట్లా కార్డు ప్రైమ్ 2.0 విధానం ద్వారా మాత్రమే రిజిస్టర్ చేసుకోవాలని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు చెప్పడంతో దస్తావేజు లేఖరులు, క్రయవిక్రయదారులు తలలు పట్టుకుంటున్నారు. జిల్లాలోని మార్కాపురం, కంభం, గిద్దలూరు, ఎర్రగొండపాలెం, కనిగిరి, దర్శి, పొదిలి, చీమకుర్తి, ఒంగోలు, అమ్మనబ్రోలు, శింగరాయకొండ, సంతనూతలపాడులో రిజిస్ట్రేషన్ కార్యాలయాలున్నాయి. ఈ 12 కార్యాలయాలు కలిపి సగటున ప్రతిరోజూ 200 నుంచి 300 వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. మారిన విధానంలో రోజుకు 30 లోపే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నట్లు సమాచారం. ప్రతిదీ ఒకటికి రెండుసార్లు చూసుకోవాల్సి వస్తుందని, ఆన్‌లైన్‌లో తప్పులుంటే తలనొప్పులు వస్తాయని సిబ్బంది చెబుతున్నారు.

జిల్లా అభివృద్ధికి సహకరించండి

- ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం
- జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ
- ఉత్సాహంగా జడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

మాట్లాడుతున్న బూచేపల్లి వెంకాయమ్మ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులు జిల్లా సమగ్రాభివృద్ధికి సహకరించాలని జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పేర్కొన్నారు. స్థానిక పాత జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం జిల్లా ప్రజా పరిషత్ అధ్యక్షురాలు బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులు జిల్లా అభివృద్ధికి సహకరించాలన్నారు. జడ్పీ సిఇఒ బి. జాలిరెడ్డి నిర్వహణలో ప్రకాశం జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఉత్సాహంగా జరిగాయి. సభ్యులకు పంపబడిన అజెండా ప్రకారం ముందుగా 2వ స్థాయీ సంఘమైన గ్రామీణాభివృద్ధి శాఖ పై, 1, 7 స్థాయీ సంఘాలైన పనులు, ఆర్థిక విషయాల పై, 4వ స్థాయీ సంఘమైన అయిన విద్య / వైద్య శాఖల పై సమీక్షించారు. సమావేశంలో 3 జిల్లాలకు సంబందించిన అధికారులు, సంబంధిత కమిటీల జడ్పీటిసి సభ్యులు హాజరయ్యారు. 3వ స్థాయీ సంఘమైన వ్యవసాయం జడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ యన్నాబత్తిన అరుణ, 5 వ కమిటీకి మారెడ్డి అరుణ, 6వ కమిటీకి జడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ చుండి సుజ్ఞానమ్మ అధ్యక్షత వహించి ఆయా విభాగాలపై సమీక్ష నిర్వహించారు.

రూ.33.68 కోట్లతో బడ్జెట్ ఆమోదం

జిల్లా ప్రజా పరిషత్ అత్యవసర సమావేశంలో జడ్పీ 2024-25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అంచనా రూ.33,68,59,732 ఆమోదించారు. జిల్లా పరిషత్ సాధారణ నిధులు 23 శాతంలో 7.74 కోట్లు, 12 శాతంలో రూ.4.04 కోట్లు, 15 శాతం స్త్రీ, శిశు సంక్షేమంలో రూ.5.05 కోట్లు, 15 శాతం షెడ్యూలు కులాల సంక్షేమానికి రూ..5.05 కోట్లు, 15 శాతం కార్యాలయ నిర్వహణకు రూ.5.05 కోట్లు, 6 శాతం షెడ్యూలు తెగల సంక్షేమం కోసం రూ.2.02 కోట్లు, 4 శాతం లో రూ..1.34 కోట్లు, 10 శాతంలో 3.36 కోట్లు ఆయా కేటగిరీలకు కేటాయించారు. జడ్పీటిసి సభ్యుల ప్రవేశపెట్టిన బడ్జెట్ అంచనాలను జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ఏకగ్రీవంగా ఆమోదించారు.

మరో మూడు నెలల్లో వైసిపి ప్యాకప్

నేతన్నలతో లోకేష్

- యువగళం బహిరంగ సభలో నారా లోకేష్

ప్రజాశక్తి - అమలాపురం, ముమ్మిడివరం(డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ)

జగన్ పని అయిపోయిందని, మరో మూడు నెలల్లో వైసిపి ప్యాకప్ చేసుకోవాల్సిందేనని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పాదయాత్ర 212వ రోజు ముమ్మిడివరం నియోజకవర్గంలో సాగింది. ఈ సందర్భంగా ముమ్మిడివరంలో ఈ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ దాట్ల సుబ్బరాజు అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో లోకేష్ మాట్లాడారు. లోక్‌సభ స్పీకర్‌గా ఎదిగిన బాలయోగి రాజకీయం ప్రస్థానం మొదలైంది ముమ్మిడివరం నియోజకవర్గంలోనే అని గుర్తు చేశారు. ఎంతో ఘన చరిత్ర ఉన్న ముమ్ముడివరంలో పాదయాత్ర చేయడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. జగన్ ఒకటి ఊహిస్తే మరొకటి జరిగిందని, చంద్రబాబును అరెస్ట్ చేసి 53 రోజులు న్యాయానికి సంకెళ్లు వేశారని, చివరికి నిజమే గెలిచిందని పేర్కొన్నారు. మరో మూడు నెలల్లో టిడిపి, జనసేన ప్రభుత్వం వస్తుందన్నారు. అక్రమ కేసులకు అరెస్టులకు భయపడేది లేదని తెలిపారు. ఉపాధ్యాయులపై జగన్ కక్ష సాధింపు చర్యలు దిగుతున్నారని విమర్శించారు. ఎలాంటి తప్పులూ లేకున్నా ఉపాధ్యాయులకు మెమోలు ఇస్తూ భయాందోళనకు గురిచేస్తున్నారని తెలిపారు. టిడిపి ప్రభుత్వం రాగానే ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. జరగబోయేది పేదలకు, దోపిడీదారులకు మధ్య యుద్ధమని తెలిపారు. జాబ్ కేలండర్‌ను జాబ్ లెస్ కేలండర్‌గా మార్చేసి ప్రభుత్వం యువత భవిష్యత్తుపై దెబ్బకొట్టిందని విమర్శించారు.

డిఎస్‌సిని చెత్తకుప్పలో పడేశారన్నారు. తాము అధికారంలోకి వస్తే యువతను అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ప్రతి ఏడాదీ ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేపడతామని, నిరుద్యోగ భృతి నెలకు రూ. మూడు వేలు అందిస్తామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేనకు పట్టం కట్టాలని కోరారు. సభ అనంతరం భోజన విరామానికి వెళ్లి మధ్యాహ్నం మూడు గంటల నుంచి యాత్రను కొనసాగించారు. మహిళలు, యువత, దళితులతో సమావేశమయ్యారు. సాయంత్రానికి యాత్ర సుంకరపాలెంలో ఏర్పాటు చేసి క్యాంపు సైటుకు చేరుకుంది. గురువారం యాత్ర కాకినాడ జిల్లాలో ప్రవేశించనుంది.

'కంది'కి తెగుళ్ల బెడద

(మొదటిపేజీ తరువాయి)

నష్టపోతున్నారు. పూత దశలో పూలను గూడుగా చేసి లోపలి పిండి పదార్థాలను తింటుంది. పిందెలు, కాయలు, తయారయ్యేటప్పుడు దగ్గరకు చేర్చి, పిందెలకు, కాయలకు రంధ్రం చేసి లోపల గింజలను తింటాయి. దీంతో ఎక్కువగా పంట నష్టం జరుగుతోంది.

కంది రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

కైపు బ్రహ్మారెడ్డి, రైతు, మురారిపల్లి

ఈ ఏడాది కంది పంటలు సాగు చేసి తీవ్రంగా నష్టపోయాం. ఎకరాకు రూ. 25 వేలు దాకా పెట్టుబడి పెట్టాం. గత ఏడాది కూడా కంది పంటకు తీవ్ర నష్టం వచ్చింది. అయితే కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వం కంది పంటకు నష్టపరిహారం అందజేసింది. మా ప్రాంతంలో మంజూరు చేయలేదు. ఈ ఏడాదైనా కంది పంటకు నష్ట పరిహారం అందించి కంది రైతులను ఆదుకోవాలి.

నివారణకు చర్యలివీ..

నీరజ, ఏడీఏ, యర్రగొండపాలెం

కంది పంటకు మారూకా మచ్చల పురుగు ఆశించింది. అక్కడక్కడా పచ్చపురుగు ఆశించింది. పంట పూత నుంచి కాయ దశలో ఉంది. వీటి నివారణకు ఎకరాకు 10-15 పక్షి స్థావరాలను ఏర్పాటు చేయాలి. పూత దలో ఉంటే హెక్టారుకు క్లోరో పైరోపాస్ 2.5 లీటర్లు, పూత, కాయ దశలో ఉంటే క్వినాల్ఫాస్ 2.0 మిలీ, లేక ఆసిపేట్ 1000 గ్రాములు 750-1000 లీటర్ల నీటిలో కలిపి హ్యాండ్ కంప్రెషన్ స్ప్రేయర్‌తో పిచికారీ చేయాలి. ఇలా చేస్తే పురుగు ఉధృతిని నివారించుకోవచ్చు.

డాక్టర్ పిచ్చయ్యకు అవార్డు

ప్రజాశక్తి-గిద్దలూరు

గిద్దలూరు పట్టణానికి చెందిన డాక్టర్ మొర్రి పిచ్చయ్యను జాతీయ జ్యోతిరావు పూలే లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డు-2023 వరించింది. డాక్టర్ పిచ్చయ్య గత 20 సంవత్సరాలుగా యశ్వంత్ ఎడ్యుకేషనల్ సొసైటీ అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా తన వేతనంలో 20 శాతం నగదును విద్యాభివృద్ధికి, సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగిస్తున్నారు. బాలికల విద్యాభివృద్ధికి అంకిత భావంతో నిరంతరం కృషి చేస్తున్నారు. మై యూత్ వాలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు ప్రసాద్ చేతుల మీదుగా పిచ్చయ్య అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మొర్రి పిచ్చయ్య మాట్లాడుతూ తాను అవార్డుకు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. అవార్డును ప్రదానం చేసిన మై యూత్ వాలంటరీ ఆర్గనైజేషన్ కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. అవార్డు అందుకున్న సందర్భంగా పిచ్చయ్యకు స్వచ్ఛంద సంస్థలు, ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు, ప్రజా సంఘాలు, ఉపాధ్యాయులు, మిత్రులు అభినందనలు తెలిపారు.

థర్మకోల్ ఫ్యాక్టరీలో భారీ అగ్నిప్రమాదం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లో మరో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. థర్మకోల్ ఫ్యాక్టరీలో పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ ఆర్‌జిఐఎ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గగన్‌పహాడ్ పారిశ్రామికవాడలో థర్మకోల్ ఫ్యాక్టరీలో సాయంత్రం వెల్డింగ్ చేస్తుండగా షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చేలరేగాయి. ఇవి ఫ్యాక్టరీ మొత్తం వ్యాపించాయి. వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ఫ్యాక్టరీ లోపల సిలిండర్లు ఉన్నందున అవి పేలే అవకాశం ఉందని పరిసర ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అగ్ని ప్రమాదం కారణంగా ఫ్యాక్టరీలో పెద్దఎత్తున ఆస్తి నష్టం జరిగినట్టు అంచనా వేస్తున్నారు. అయితే ప్రాణనష్టం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

వచ్చే ఎన్నికల్లో విశాఖ నుంచే పోటీ

సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖ)



వచ్చే ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా విశాఖ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయనున్నట్లు సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వివి.లక్ష్మీనారాయణ తెలిపారు. విశాఖలోని విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో తాను విశాఖ నుంచి పోటీ చేయగా సుమారు మూడు లక్షల ఓట్లు వచ్చాయని తెలిపారు. విశాఖ ప్రజలు తనను ఎంతగానో ఆదరించారని చెప్పారు. వారి ఆదరణను చూసి మళ్లీ ఇక్కడి నుంచే పోటీ చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కొన్ని రాజకీయ పార్టీలు తనను ఆహ్వానిస్తున్నాయని, వాటిని పరిశీలిస్తున్నానని చెప్పారు. తనకు పార్టీ నచ్చితే దాని తరుపున పోటీ చేసేందుకు అభ్యంతరం ఉండదన్నారు.

రాజకీయాలలో నిజాయితీగా ప్రజాసేవ చేసేందుకు వచ్చే వారికి ప్రజల ఆదరణ ఉంటుందని తెలిపారు. దీనికి రాజకీయాలతో పనిలేదన్నారు. అందుకే తాను కొత్తగా రాజకీయ పార్టీని స్థాపించాలని కూడా ఆలోచిస్తున్నానని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో కొల్లాపూర్ అసెంబ్లీ స్థానం నుంచి స్వతంత్రంగా పోటీ చేస్తున్న బర్రెలక్కకు (శిరీష) ప్రజల నుంచి మద్దతు లభిస్తోందన్నారు. ఉన్నత విద్యనభ్యసించి ఉద్యోగం లభించక బర్రెల లక్కగా మారిన ఆమె, ప్రజాసేవ చేయాలని భావించి, ఎన్నికల బరిలోకి దిగిన విషయాన్ని గుర్తు చేశారు. ఓటర్ల జాబితాలో బోగస్ ఓట్లను కచ్చితంగా తొలగించాలన్నారు. ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

2న మెగా జాబ్ మేళా

పిఎం.పాలెం క్రికెట్ స్టేడియం వెనుక ఉన్న సాంకేతిక ఇంజనీరింగ్ కళాశాలలో జెడి.ఫౌండేషన్ ఆధ్వర్యాన డిసెంబర్ 2న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు వివి.లక్ష్మీనారాయణ ప్రకటించారు. జాబ్ మేళాలో 50కిపైగా కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. పదో తరగతి ఆపై విద్యార్హతలున్నవారు జాబ్ మేళాలో పాల్గొనవచ్చని చెప్పారు. జాబ్‌మేళాలో ఉద్యోగం సాధించలేని వారికి ప్రత్యేకంగా స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇచ్చి ఉపాధి వచ్చేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జెడి ఫౌండేషన్ కన్వీనర్ ప్రియాంక దండి, కృష్ణమోహన్, నిశ్చల్, నాగరాజు, సాంకేతిక కాలేజీ ప్రతినిధి కృష్ణకుమార్ పాల్గొన్నారు.

వికలాంగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

వికలాంగుల సమస్యలను పరిష్కరించాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్మా రాజయ్య డిమాండ్ చేశారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడి ఐదు సంవత్సరాలు గడుస్తున్నా సిఎం హోదాలో ఒక్క సారి కూడా వికలాంగుల దినోత్సవ కార్యక్రమానికి హాజరు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వికలాంగుల పెన్షను రూపాయి కూడా పెంచలేదన్నారు. వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. వికలాంగుల చట్టం 2016ను పటిష్టంగా అమలు చేయాలని కోరారు.

NOTICE
IN THE COURT OF THE HON'BLE 2ND ADDL. SENIOR CIVIL JUDGE :: GUNTUR
E.P.No.272/2018 in O.S.No.443/2013
Between:
Damarla Vasantha Rao ...D.H.R.
AND
Komarapuri Gangachalam & Others ...J.D.R.'s
To,
J.D.R. No-2: Komarapuri Siva Kumari, W/o. Lakshmipurapu Venkateswara Rao, School Assistant, Z.P. High School, Repalle, Bapatla Dt.
పై నెంబరు E.P.లో **2వ జె.డి.ఆర్.** అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా SALE నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు Subsituted Service ద్వారా పేపరులో ప్రకటన ద్వారా తెలియపరచమని ఆర్డరు వేయగా సదరు ఆర్డరు ప్రకారము మీరు **ది.11-12-2023 ఉ.గం. 10.30 ని.లకు** పై తెలిపిన కోర్టునకు మీరు స్వయంగా కానీ, మీ అడ్వకేట్ ద్వారా గాని, హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరచు కొనవలయును. లేని ఎడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని తెలియపర్చడమైనది.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము)
వాయిదా తేది: 11-12-2023
జి.వి.రమణ, డి.హెచ్.ఆర్. తరఫు అడ్వకేట్, గుంటూరు. సెల్: 9848231931

పేపర్ ప్రకటన
మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇపి 54/2023
ఇన్
ఓఎస్ నెం.226/2022
జాజం వెంకటరమణ .... డిహెచ్ఆర్
వర్సెస్
అయ్యపురాజు నాగాదుర్గ వీరాజినెయులు (చనిపోయారు) అతని 2వ క్లాసు చట్టపరమైన వారసులు అయ్యపు రాజు రాజేంద్రకుమార్ ..... జెడిఆర్ఎస్
జెడిఆర్ చిరునామా:
జెడిఆర్) అయ్యపురాజు రాజేంద్రకుమార్ తండ్రి చలపతిరావు, హిందూ, వ్యవసాయం వయస్సు సుమారు 55సం॥లు, కొమరోలు గ్రామం మరియు పోస్టు, కొమరోలు మండలం, ప్రకాశం జిల్లా.
పైన పేర్కొన డిక్రీ హొల్డర్, పేర్కొన్న 1వ తీర్పు రుణ గ్రహిత/ప్రతివాది యొక్క ఇపి షెడ్యూలు ఆస్తిని వేలం వేయడానికి జోడించిన ఇపి షెడ్యూల్ స్థిరాస్తి యొక్క అమలు పిటిషన్‌ను దాఖలు చేశారు. 1వ తీర్పు రుణ గ్రహీత/ప్రతివాది మరణించి నందున, డిహెచ్ఆర్ ఇక్కడ ఇపిలో ప్రస్తావించ బడింది. 2వ తరగతి చట్టపరమైన వారసుడిగా మీరు 1వ జెడిఆర్‌కి 2వ తరగతి చట్టపరమైన వారసుడు కాబట్టి మీరు ఈ కోర్టుకు 21వ తేది డిసెంబర్ నెల 2023 ఉదయం 10:00గంటలకు (ఉదయం) లేదా న్యాయవాదుల ద్వారా హాజరు కావాలి మరియు మీ అభ్యంతరాలను తెలియజేడానికి కోర్టును ఆశ్రయించ వలసి ఉంటుంది. హాజరు కాకపోతే ఆ విషయంపై విచారణ జరిపి పరోక్షమంగా నిర్ణయం తీసుకుంటా మని తెలియజేశారు.
// శ్రీ కోర్టు వారి ఉత్తర్వు మేరకు //
గిద్దలూరు
తేది:29.11.2023
శ్రీ షేక్.యాసిన్‌బాషా
డిహెచ్ఆర్ తరపు అడ్వకేట్
గిద్దలూరు, ప్రకాశం జిల్లా.
సెల్ నెం.9346513649

మహారాజశ్రీ 2 వ అదనపు జిల్లా జడ్జి ఒంగోలు వారి కోర్టులో
IA No : 23/2021
ఇన్
IA No : 391/2018
ఇన్
OS No :181/2018
దామచర్ల ప్రసాద్ ....పిటిషనర్/వాది
వర్సెస్
రాయవరపు గురవయ్య వురఫ్ ఆర్టిసి గురవయ్య (డైడ్) వగైరాలు ... రెస్పాండెంట్లు /ప్రతివాదులు
నోటీసు
To
R3) రాయవరపు (ధనియాల) శ్రీదేవి తండ్రి రాయవరపు గురవయ్య, భర్త ధనియాల హరికృష్ణ
R4)రాయవరపు (గద్దె)సునీత తండ్రి రాయవరపుగురవయ్య భర్త గద్దె చంద్రశేఖర్
డోర్ నెంబర్ 32-54-807(పాత డోర్ నెంబర్ 5-4-11/జి) వెంకటేశ్వర నగర్ 1 వ లైన్ కర్నూలు రోడ్, ఒంగోలు, పిన్ 523002
వాది దామచర్ల ప్రసాద్ తనకు రావలసిన బాకీకై ప్రతివాది రాయవరపు గురవయ్య పై దావా చేసి IA No: 391/2018 లోని శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ద్వారా సదరు గురవయ్య ఆస్తులు జప్తు చేయగా, సదరు గురవయ్య మరణించి నందున,వారి లీగల్ రెప్రెజెంటేటివ్స్ (LRs) లకు నోటీసులు పంపినను తీసుకొననందున, ఈ పత్రిక ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా తేది 07-12-2023న ఉదయం 10 గంటల 30 నిమిషాలకు, మీరు గాని మీ అడ్వకేట్ గారి ద్వారా గాని శ్రీ కోర్టు వారి ముందు హాజరై మీ ఆక్షేపణలు ఏమైనా ఉన్నచో తెలుపుకోనగలరు. లేని పక్షములో మీ పరోక్షమున విచారణ జరుగును.
// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
ఒంగోలు
తేది : 29.11.2023
ఇట్లు
పత్తిపాటి రామమూర్తి
పిటిషనర్ తరపు న్యాయవాది
ఒంగోలు
సెల్ : 9849335376

జగన్ పాలనలో వ్యవస్థల్లో మార్పులు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన నాలుగున్నరేళ్ల పాలనలో వ్యవస్థల్లో అనేక మార్పులు తీసుకొచ్చి, ప్రభుత్వ పాలనను ప్రజల వద్దకు చేర్చారని 40వ డివిజన్ కార్పొరేటర్ తేళ్ల చంద్రశేఖర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలనే కార్యక్రమం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో బుధవారం 40వ పరిధిలోని ఇందిరా నగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి సిఎం అయిన తరువాత తన పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలలో 99 శాతం నెరవేర్చారని తెలిపారు. సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి సంక్షేమ పథకాలను ఇళ్లకే వచ్చి అందిస్తున్నారని వివరించారు. వైసిపి పాలనలో చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రజల గడప వద్దకే చేరాయని తెలిపారు. అందుకే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని తెలిపారు. ఈ

మాట్లాడుతున్న కార్పొరేటర్ చంద్రశేఖర్

కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది ఆలేటి సురేష్, ప్రవీణ్, మహేష్, రమాదేవి పాల్గొన్నారు. **టంగుటూరు :** గ్రామస్తులు, ప్రభుత్వాధికారులు, నాయకులందరి సహకారంతో గ్రామాభివద్ధిని సాధించాలని వైసిపి మండల అధ్యక్షుడు మల్లవరపు రాఘవరెడ్డి, గ్రామ సర్పంచి పసుమర్తి ఈశ్వరమ్మ పేర్కొన్నారు. మండల పరిధిలోని కందులూరు గ్రామంలో 'వై ఏపీ నీడ్స్ జగన్', 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ అభివద్ధిలో గ్రామస్తులందరితో పాటు ప్రభుత్వ అధికారుల కషి ఎంతో కీలకమన్నారు. గ్రామాలలో సచివాలయాల నిర్మాణాలతో పథకాలన్నీ పూర్తిగా ప్రజల వద్దకు చేరాయని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి కుటుంబానికి ఇన్ని సంక్షేమ పథకాలు అందుతున్నాయంటే దానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ముందు చూపే కారణమన్నారు. వైసిపి జెండాను ఆవిష్కరించారు అనంతరం సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకుడు ఉప్పలపాటి రామరాజు, ఇఒపిఆర్‌డి నర్రా జగదీష్ బాబు, పంచాయతీ కార్యదర్శి శ్యామ్ సుందర్, నాయకులు మన్నం వెంకయ్య, ఆనం సత్యనారాయణ రెడ్డి, ఉప్పలపాటి సత్యరాజు, వార్డు సభ్యులు పామర్తి రాజశేఖర్, సురేంద్ర, పసుమర్తి ఆనంద్, మద్దులూరి లక్ష్మయ్య, రామ్మూర్తి రాజు, ఇసాక్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కొండపి : మండల పరిధిలోని పెట్లూరు సచివాలయం వద్ద

నగదు అందజేస్తున్న కౌన్సిలర్ నాగేశ్వరరావు

రూ.10వేల నగదు అందజేత

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం మున్సిపాలిటీలోని గాంధీ బజారు సచివాలయ పరిధిలోని శివాజినగర్ 3వ లైన్‌లో నివాసం ఉంటున్న జులుకూరి రమణమ్మ మంగళవారం మృతి చెందింది. ఆమె మట్టి ఖర్చుల నిమిత్తం వైఎస్ఆర్ బీమా పథకం ద్వారా రూ. 10వేల నగదును 24వ వార్డు కౌన్సిలర్ బుశ్శెట్టి నాగేశ్వరరావు మృతురాలి కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి అడ్మిన్ పి.నాగభూషణం, వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీ సిహెచ్.నాగేశ్వరరావు, వాలంటీర్ డి.హిమబిందు పాల్గొన్నారు.

ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

మొక్కుబడిగా మండల సమావేశం

ప్రజాశక్తి-మద్దిపాడు

మద్దిపాడు మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి వాకా అరుణ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సమావేశం మొక్కుబడిగా సాగింది. ప్రజా సమస్యలపై గళమెత్తేవారు లేకపోవడంతో సమావేశం మూగబోయింది. సమావేశం ప్రారంభమైన కొద్దిసేపటికే ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి సమావేశంలో అధికారులు తమ శాఖలకు సంబంధించిన నివేదికలను మొక్కుబడిగా వివరించారు. విద్యుత్ శాఖ ఎఇ నుంచి సరైన స్పందన ఉండటం లేదని సమావేశం దృష్టికి సభ్యులు తీసుకువచ్చారు. తహశీల్దారు రజనీకుమారి గైర్హాజరుపై సభ్యులు అసంతప్తి వ్యక్తం చేశారు. రెవెన్యూకు సంబంధించిన సమస్యలపై సమావేశంలో ప్రస్తావించారు. భవిషత్తులో అన్ని శాఖల అధికారులు సమావేశానికి వచ్చేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ శ్రీనివాసరావు, సర్పంచులు, ఎంపిటిసిలు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

టిడిపితోనే రాష్ట్ర భవిష్యత్తు : కందుల

ప్రజాశక్తి-మార్కాపురం

రాష్ట్ర ప్రజల భవిష్యత్ బాగుండాలంటే రాబోవు ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని టిడిపి పోల్ మేనేజ్‌మెంట్ క్లస్టర్ ఇన్‌ఛార్జి కందుల రామిరెడ్డి తెలిపారు. మార్కాపురం మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో బాబు ష్యూరిటీ–భవిష్యత్‌కు గ్యారెంటీ' కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఐదేళ్లలో పెరిగిన భారాల గురించి వివరించారు. టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేసే సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, పట్టణ ప్రధాన కార్యదర్శి కొప్పుల శ్రీనివాసులు, నాయకులు తాళ్లపల్లి వెంకట సత్యనారాయణ, డి.మస్తానయ్య, సయ్యద్ గఫార్, మట్టం వెంకటేశ్వర్లు, పఠాన్ గులాబ్‌ఖాన్, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు : రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే తిరిగి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా చేయాలని టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి గుమ్మడి సాయిబాబా తెలిపారు. మండల పరిధిలోని మద్దిరాలపాడు గ్రామంలో బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి వైసిపి వైఫల్యాల గురించి వివరించారు. టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో 198వ బూత్ ఇన్‌ఛారి స్వర్ణ కిషోర్ బాబు, టిడిపి గ్రామ అధ్యక్షుడు పెనుబోతు సునీల్ కుమార్ , నాయకులు చాట్లగడ్డ ఐజక్, అంచు పోగు మత్తయ్య, బత్తుల లక్ష్మీప్రసాద్, బత్తుల అనిల్ కుమార్, జాన్ పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ బ్రహ్మానందరెడ్డి

232 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - గిద్దలూరు

స్థానిక గడికోటలో డాక్టర్ బ్రహ్మానందరెడ్డి హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ బ్రహ్మానంద రెడ్డి ఆధ్వర్యంలో బిపి, షుగర్, కంటికి సంబంధిత పరీక్షలు నిర్వహించిన మందులు అందజేశారు.మొత్తం 232 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో 29 మంది కంటి ఆపరేషన్లు అవసరమని నిర్ధారించారు. మరో 14 మంది ఇతర ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్లు అందజేత

ప్రజాశక్తి-కొండపి

కొండపి మండలం పెదకండ్లగుంట జడ్‌పి స్కూల్‌లో చదువుతున్న జాళ్లపాలెం, పీరాపురం గ్రామాలకు చెందిన విద్యార్థులకు పీజీ ఎన్‌ఎస్‌ఎఫ్ బ్యాంకు ఆధ్వర్యంలో బుధవారం సైకిళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎండ్లూరి శ్రీనివాసరావు, దాత డాక్టర్ సుదాకర్, జాళ్లపాలెం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మంచికంటి వెంకటేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్కూల్ కమిటీ చైర్మన్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నాసర్ సాహెబ్ మృతి

ప్రజాశక్తి-మార్కాపురం

నాసర్ సాహెబ్ (ఫైల్)

మార్కాపురం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ చిన్న నాసర్‌సాహెబ్ (90) బుధవారం మధ్యాహ్నం మృతి చెందారు. ఆయన కాంగ్రెస్ పార్టీ తరపున కౌన్సిలర్‌గా గెలుపొందారు. ఆ సమయంలో వైస్ చైర్మన్‌గా అవకాశం దక్కింది. మాజీ ఎమ్మెల్యే కెపి.కొండారెడ్డి అనుచరుడిగా చిన్న నాసర్‌సాహెబ్ కొనసాగారు.

'మట్కా'తో జీవితాలు చిత్తు..

గిద్దలూరు : తక్కువ సమయంలో ఎక్కువ సొమ్ము సంపా దించాలన్నా పేదలు, దినసరి కూలీల ఆశ మాట్కా జూదరులకు కాసుల పంట కురిపిస్తోంది. గిద్దలూ పట్టణంలో పలు వీధులు మట్కా జూదం నిర్వహించారు. రోజుంతా పనిచేసిన కూలీలు ఎక్కువ డబ్బులు సంపాదించాలన్న ఆశతో కూలీ డబ్బులు మట్కా బుక్కర్లకు ధార పోస్తున్నారు. మంగళవారం రాత్రి గిద్దలూరు పట్టణంలోని రాచర్ల గేటు సెంటర్‌లో మట్కా జూదం నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో సెబ్ సిఐ అరుణకుమారి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి ఇద్దరు మట్కా బుక్కర్స్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 3,750 నగదు స్వాధీనం చేసుకున్నారు.

దాడులు నిర్వహిస్తున్నాం
అరుణ కుమారి, సెబ్ సిఐ

మట్కా నిర్వహణపై దాడులు నిర్వహిస్తున్నారు. మట్కా నిర్వాహకులు,బీటర్లపై కేసులు నమోదు చేసి కౌన్సిలింగ్ ఇస్తున్నాం. ఎక్కడైనా మట్కా నిర్వహిస్తున్నట్లు తెలిస్తే సమాచారం అందించాలి.

హత్య కేసులో నిందితుడు అరెస్టు వివరాలు వెల్లడించిన సిఐ

ప్రజాశక్తి-దర్శి

హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు సిఐ జె. రామకోటయ్య తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సిఐ వివరాలు వెల్లడించారు. సిఐ కథనం ప్రకారం... ఉత్తరప్రదేశ్‌కు చెందిన నలుగురు వ్యక్తులు కార్పెంటర్ పనులు నిమిత్తం దర్శి పట్టణానికి వచ్చారు. బాదం మాధవరెడ్డి ఇంట్లో ఇంటీరియల్ పనులు చేస్తున్నారు. మధ్యలో ఇద్దరు వ్యక్తులు హైదరాబాద్ వెళ్లారు. ఫిరోజ్ అన్సారి, నిందితుడు దీపక్ సహని ఇక్కడే ఉంటున్నారు. ఈనెల 7న రాత్రి సమయంలో ఇద్దరు కలిసి మద్యం తాగారు. మద్యం మత్తులో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. చివరకూ నిందితుడు దీపక్ సహని స్టీల్ కడ్డీతో ఫిరోజ్ ముఖంపై కొట్టాడు. ఫిరోజ్ చనిపోయినట్లుగా భావించి అనుమానం రాకుండా అక్కడే ఉండి తెల్లవారు జాము తరువాత మృతుడికి యాక్సిడెంట్ అయి దెబ్బలు తగిలినట్లు వాచ్‌మెన్‌కు చెప్పాడు. గాయపడిన ఫిరోజ్‌ను గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 23న ఫిరోజ్ మృతిచెందాడు. తొలుత అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం ఎస్‌పి ఆదేశాల మేరకు దర్శి డిఎస్‌పి అశోక్‌వర్ధన్ పర్యవేక్షణలో సిఐ రామకోటయ్య హత్య కేసు నమోదు చేశాడు. ఈ క్రమంలో దీపక్ సహని బయపడి రాజగోపాల్‌రెడ్డి అనే వ్యక్తికి జరిగిన విషయం గురించి చెప్పాడు. అనంతరం విఆర్ఒ సమక్షంలో పోలీసుల వద్ద లొంగిపోయాడు. పోలీసులు నిందితుడిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజుల పాటు రిమాండ్ విధించినట్లు సిఐ తెలిపాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-దర్శి

బైకును గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఓవ్యక్తి మృతి చెందాడు. మరో ఇద్దరికి గాయాల య్యాయి. అందిన వివరాల ప్రకారం... ఒరిగల బాలయ్య(65), జున్ను కొండయ్య,బాపట్ల బ్రహ్మయ్య అనే వారు దర్శి నుంచి తిమ్మాయపాలెం బైకుపై వెళ్తున్నారు. అదే సమయంలో గుర్తు తెలియని వాహనం బైకును ఢీకొంది. దీంతో బాలయ్య, కొండయ్య, బ్రహ్యోయ్యకు గాయాల య్యాయి. క్షత గాత్రులను 108లో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికీ బాలయ్య మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

హెచ్ఐవి, ఎయిడ్స్ బాధితుల పట్ల ఎలాంటి వివక్షత చూపరాదని నాగులపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు భారతి తెలిపారు. డిసెంబర్1న ఎయిడ్స్ దినోవాత్సన్ని పురస్కరించుకుని హెల్ప్‌టిఐ ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నాగులుప్పలపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు ఈ సందర్భంగా భారతి మాట్లాడుతూ హెచ్ఐవి, ఎయిడ్స్ పట్ల ప్రజలకు చైతన్యం కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు హెచ్ఐవి భాదితులకు అవగాహన కలిగించి వారికి పౌష్టికాహారం అందించేందుకు ప్రతి ఒక్కరకూ కృషి చేయాలన్నారు. ఎఎన్ఎం రాధమ్మ మాట్లాడుతూ హెచ్ఐవి, ఎయిడ్స్ బాధితులు సకాలంలో మందులు వినియోగించ ుకోవాలన్నారు. ఈ కార్యక్ర మంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాటర్ క్యాన్లు బహూకరణ

ప్రజాశక్తి-మార్కాపురం

ప్రముఖ వ్యాపారవేత్త రావిక్రింది కోటేశ్వరరావు జన్మదిన వేడుకల సందర్భంగా మార్కాపురం మున్సిపాలిటీ పరిధిలోని భగత్‌సింగ్ కాలనీలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాలకు కూలింగ్ వాటర్ క్యాన్లు బుధవారం బమూకరించారు. ఈ కార్యక్రమంలో బాలాజీసింగ్, అంగన్‌వాడీలు పి.వెంకటరత్నం, శ్రీదేవి, పద్మావతి, సునీత తదితరులు పాల్గొన్నారు.

పట్టణ ప్రజల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలోని వివిధ ప్రజా సమస్యలపై పట్టణ ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, అఖిలపక్షం ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ బి శ్రీనివాసులుకు బుధవారం వినతి పత్రం అందజేశారు. పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మన్నం త్రిమూర్తులు, ప్రజారోగ్య వేదిక అధ్యక్షులు కావూరి రఘు చంద్, కాంగ్రెస్ నాయకులు కోరే సురేంద్రనాథ్, సిపిఎం మండల కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పట్టణంలో అనేక సమస్యలు ప్రజలను అన్ని విధాల వెంటాడుతున్నాయని అన్నారు. తమ పరిధిలో పరిష్కారం అయ్యే పనులకు తక్షణం పరిష్కారం చూపాలని కోరారు. సంబంధిత అధికారులతో చర్చించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రెండు సంవత్సరాల కిందట ఇంటింటికీ త్రాగునీటి కులాయిలో భాగంగా పగలగొట్టిన సిమెంట్ రోడ్ల రిపేర్ చేయాలని కోరారు. 15ఏళ్ల కిందట నామ్ రోడ్డు నిర్మాణ

కమిషనర్ శ్రీనివాసరావు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

పనులు చేపట్టి నేటికీ అస్తవ్యస్త పనులతో నేటికీ నిర్మాణ పనులు పూర్తికాకుండా రోడ్డు ఫాల్స్ నిర్మాణ పనులతో 200మందికిపైగా ప్రమాదాల్లో అమాయకులు మృత్యువాత పడి వికలాంగులుగా ఉన్నారని అన్నారు. పట్టణంలోని నామ్ రోడ్డులో కొంతవరకైనా ప్రమాదాల నివారించుటకు కొన్ని మార్గదర్శక సూత్రాలను అవలంబింప చేయమని, రోజు రోజుకీ వేస్ట్ డంపుగా మారిపోతున్న జీవనది గుండ్లకమ్మను ప్రస్తుత సమస్య నుండి ప్రక్షాళన చేయాలని కోరారు. మున్సిపాలిటీ అయిన తర్వాత కూడా 80సంవత్సరాల నుండి సౌకర్యాలు లేని ఇరుక గదిలో గ్రంథాలయం కొనసాగుతున్నదని అన్నారు. దీనికి శాశ్వత నూతన గ్రంథాలయ భవనంకు చర్యలు చేపట్టాలని కోరారు. దోమల బెడదను అరికట్టాలని కోరారు. అంతర్గత రోడ్డు ప్రారంభంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లతో ట్రాఫిక్ ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. రోడ్ల మలుపు వద్ద సూచికలు లేకపోవుట వలన ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ట్రాఫిక్‌కు అడ్డంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను అక్కడి నుండి మార్చాలని కోరారు. స్టేట్ బ్యాంకు మెయిన్ బ్రాంచ్ దగ్గర, రాంనగర్, నాగులపాడు వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను మార్చాలని కోరారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో దాస భారతీయ జానపద కళాక్షేత్రం అధ్యక్షులు చెన్నుపల్లి నాగేశ్వరరావు, రావూరి రంగయ్య, కెల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

గ్రోమోర్ దుకాణంలో తనిఖీ చేస్తున్న ఎఒ సుబ్బారెడ్డి

ఎరువుల దుకాణంలో తనిఖీలు

ప్రజాశక్తి - పంగులూరు

స్థానిక మన గ్రోమోర్ ఎరువుల దుకాణంను ఎఒ సుబ్బారెడ్డి బుధవారం పరిశీలించారు. దుకాణంలో ఉన్న ఎరువులు, పురుగు మందులు, వాటి బిల్లులు, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఒ సుబ్బారెడ్డి మాట్లాడుతూ మన గ్రోమోర్ ఎరువుల దుకాణంలోని ఎరువులు, పురుగు మందులు నాణ్యత ప్రమాణాలను పరిశీలించినట్లు చెప్పారు. సరుకు అనుమతులను పరీక్షించామన్నారు. బెంజోయేట్, బెకోరా అనే రెండు పురుగు మందుల నమూనాలు పరిశీలన నిమిత్తం తీసుకున్నట్లు చెప్పారు. ఎరువులకు సంబంధించి అన్ని పరిశీలించమని అన్నారు. అన్ని సక్రమంగానే ఉన్నాయని చెప్పారు. రైతు భరోసా కేంద్రాల్లో, బయటి షాపుల్లో ఎరువుల ధరలకు, మన గ్రోమోర్ షాపులో ఎరువుల ధరలకు వ్యత్యాసం ఉందా అని ప్రశ్నించగా 20:20:0:13, 28:28:0:14, 35:14, ఎరువులు రైతు భరోసా కేంద్రాల్లో, బయట ఎరువులు షాపుల్లో, ఓల్డ్ స్టాక్ ఉండటం వలన వాటి ఎమ్మార్పీ రూ.1,200 మాత్రమే ఉందని, వాళ్ళు ఆ ధరకే అమ్ముతున్నారని చెప్పారు. మన గ్రోమోర్ సెంటర్లో ఎరువులు కొత్తవి కావడం వలన వాటిపై ప్రభుత్వం ఇటీవల సబ్సిడీ తగ్గించటం వలన రూ.1,350కి అమ్ముతున్నామని మన గ్రోమోర్‌లో పనిచేసే ఉద్యోగి తెలిపారు. ఈ సంవత్సరం మండలంలో జేజీ-11 రకం శనగ విత్తనాలు 875క్వింటాళ్లు, కాక్ -2 రకం శనగ విత్తనాలు 874క్వింటాళ్లు వచ్చాయని ఎఒ తెలిపారు. వాటిని 40శాతం సబ్సిడీపై రైతులకు అందజేస్తున్నామని తెలిపారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న ఎఎంసి నూతన పాలకవర్గం

ఎఎంసి నూతన పాలకవర్గం

ప్రజాశక్తి - అద్దంకి

స్థానిక వ్యవసాయ మార్కెట్ నందు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక మండలి ఛైర్మన్‌గా జజ్జర ఈశ్వరమ్మ, ఆనందరావు, వైస్‌ఛైర్మన్‌గా మాకినేని శ్రీనివాసరావు, పాలక మండలి సభ్యుల ప్రమాణస్వీకారోత్సవం బుధవారం చేశారు. ఏపి శాప్ నెట్ కార్పొరేషన్ ఛైర్మన్, వైసిపి ఇంచార్జి బాచిన కృష్ణ చైతన్య, మాజీ ఎంఎల్ఎ బాచిన చెంచు గరటయ్య, వైసిపి పరిశీలకులు మారం వెంకారెడ్డి హాజరయ్యారు.

వృద్ధాశ్రమానికి బియ్యం అందజేసిన ఆదర్శ విద్యార్థినిలు

వృద్ధాశ్రమానికి చిన్నారుల వితరణ

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్, పర్చూరు

చిన్నారి చిట్టి చేతులు గట్టి ప్రయత్నం చేశారు. ఇంకొల్లు ఆదర్శ విద్యా సంస్థల విద్యార్థులు నూతలపాడులోని ఆశ్రయ వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. చాలా కాలంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో నిరు పేదలకు గుప్పెడు బియ్యం కార్యక్రమంలో భాగంగా ఆశ్రమానికి 100కేజీల బియ్యాన్ని అందజేశారు. ఈసందర్భంగా విద్యార్థినులు ఎంతో చక్కగా వృద్ధులతో మమేకమై వాళ్ళతో సంభాషించారు. చిన్నారులు చేసిన ప్రయత్నానికి ఆశ్రయ వృద్ధాశ్రమ నిర్వాహకులు, వృద్ధులు ధన్యవాదాలు తెలిపారు. ఇంత చక్కటి కార్యక్రమాన్ని నిర్వహించిన ఆదర్శ విద్యా సంస్థల డైరెక్టర్ విజయభాస్కర్‌ను ఆశ్రమ నిర్వాహకులు భవనం శ్రీనివాసరెడ్డి, జయలక్ష్మి దంపతులు అభినందించారు.

భూ సమస్యలు పరిష్కరించండి

ప్రత్యేక స్పందనలో కలెక్టర్ రంజిత్‌బాషా

ప్రజాశక్తి - చిన్నగంజాం

మండలంలో భూ సమస్యలు పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. మండలంలోని వెంకటేశ్వర కల్యాణ మండపంలో జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజా సమస్యలు పరిష్కరించడానికి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని అన్ని మండలాల్లో నిర్వహిస్తున్నామని అన్నారు. మండలంలో రెవెన్యూ భూములకు సంబంధించిన సమస్యలు ఉన్నట్లు గుర్తించామని అన్నారు. గృహ నిర్మాణాలకు నివేశ స్థల పట్టాలు కావలసిందిగా అర్జీలు ఎక్కువగా వచ్చాయని అన్నారు. మండలంలో స్పందన అర్జీలు పరిష్కారం పట్ల కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. గృహ నిర్మాణాల పనుల ప్రగతిపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. పోలీస్ శాఖలో మూడు అర్జీలు ఓపెన్ అవటం పట్ల కలెక్టర్ పోలీసులను ప్రశ్నించారు. అర్జీదారుల కంటే అధికారులు అధికంగా కనిపించారు. అర్జీదారులు, అధికారుల పేర్లు పిలవటానికి మాత్రమే అధికారులు మైకులు

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ పి రంజిత్ బాషా

ఉపయోగించారు. అర్జీదారులకు మైకు ఇవ్వకపోవడంతో అర్జీదారులు ఎలాంటి సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చింది మీడియాకు అర్థం కాలేదు. మూడు గంటలకు వచ్చిన కలెక్టర్ స్పందన అర్జీలు లేకపోవడంతో నాలుగు గంటల 30నిమిషాలకు వెళ్లిపోయారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ చామకూరి శ్రీధర్, డిఆర్ఒ పి వెంకట రమణ, చీరాల ఆర్‌డిఒ సరోజిని, చీరాల డిఎస్పి ప్రసాదరావు, డిఆర్డిఏ పిడి అర్జునరావు, గృహ నిర్మాణ శాఖ పిడి ప్రసాద్, డిపిఒ డి రాంబాబు, పంచాయతీ రాజ్ ఎస్ఇ హరి నారాయణ, పౌర సరఫరాల శాఖ డిఎస్ఓ విల్సన్, డిఎం శ్రీలక్ష్మి, ఎంపిడిఒ స్వరూపరాణి, తహసీల్దార్ పి పార్వతి పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిగా నాగయ్య

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

కార్యదర్శి నాగయ్య

ఇంకొల్లు పంచాయతీ కార్యదర్శిగా కోటి నాగయ్య ను నియమించినట్లు డిపిఒ కార్యాలయం నుండి ఉత్తర్వులు అందినట్లు ఎంపిడిఒ ఆర్ఎం రాజ్యలక్ష్మి తెలిపారు. పర్చూరు మండలం వీరన్నపాలెం పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న నాగయ్యను ఇంకొల్లు పంచాయతీ సెక్రటరీగా నియమించినట్లు ఆమె తెలిపారు. గతంలో ఇంకొల్లులో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ సెక్రటరీ మోహన్ బాబును జిల్లా అధికారులు విధుల నుండి సస్పెండ్ చేయడంతో ఖాళీగా ఉన్న స్థానంలో నూతనంగా గ్రేడ్ వన్ సెక్రటరీని జిల్లా అధికారులు నియమించినట్లు తెలిపారు.

టిడిపిలోకి ఆహ్వానిస్తున్న ఎంఎల్ఎ అనగాని సత్యప్రసాద్

టిడిపిలో చేరిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి - చెరుకుపల్లి

మండలంలోని పొన్నపల్లి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు దొంతుబోయిన సీతారెడ్డి, చెరుకుపల్లి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు వంగర మనోహర్ స్థానిక శాసనసభ్యులు అనగాని సత్యప్రసాద్ సమక్షంలో వారు తమ అనుచరులతో టిడిపిలో చేరారు. మొదటి నుండి టిడిపికి వ్యతిరేకంగా ఉన్న వీరు వైసిపికి రాజీనామా చేసి టిడిపిలో చేరడం చర్చనీయాంశమైంది. వీరితోపాటు దొంతిబోయిన శివారెడ్డి, పలువురు నాయకులు టిడిపిలో చేరారు. కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు పుషడపు కుమారస్వామి, తాత ఏడుకొండలు, పిన్నిబోయిన చింతారావు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో సంక్షేమం

సభలో మాట్లాడుతున్న ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు

ప్రజాశక్తి - చీరాల

రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించిన ఘనత వైసిపిదేనని మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు అన్నారు. ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైసిపి ఇంచార్జి కరణం వెంకటేష్ ఆదేశాల మేరకు పట్టణంలోని పావరాజుతోట సచివాలయం పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలతో కూడిన కరపత్రాలను అందజేశారు. సచివాలయం వద్ద సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు గుంటూరు మాధవరావు, వైస్ ఛైర్మన్లు బొనిగల జైసన్ బాబు, శిఖాకొల్లి రామసుబ్బులు, జిల్లా వాణిజ్య విభాగ జిల్లా అధ్యక్షులు చీమకుర్తి బాలకృష్ణ, దాసరి రామకృష్ణ, కౌన్సిలర్ గుంటూరు ప్రభాకరరావు, పొత్తూరి సుబయ్య, మల్లెల లలితరాజశేఖర్, మించాల సాంబశివరావు, కళ్యాణం విజయ్ ప్రకాష్, షేక్ సుభాని, షేక్ రియాజ్, దుడ్డు సైమన్, మామిడాల సుబ్బారావు, చిలుకోటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేపల్లె : ప్రభుత్వ సంక్షేమ పథకాలపై లబ్ధిదారులకు అందించిన నగదు వివరాలతో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల బోర్డు బుధవారం ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమం మండలంలోని పెనుమూడి సచివాలయం పరిధిలో నిర్వహించారు. సర్పంచ్ దారం విజయ్, వైసిపి రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్యబాబు వైసిపి జెండా ఆవిష్కరించారు. అనంతరం సర్పంచ్ దారం విజయ్ మాట్లాడుతూ అభివృద్ధి జరగాలన్నా, సంక్షేమ పథకాలు అందరికీ అందాలన్నా రానున్న ఎన్నిల్లో జగన్మోహన్ రెడ్డిని, మోపిదేవి వెంకటరమణరావుని గెలిపించుకోవాలని అన్నారు. పెనుమూడి సచివాలయం పరిధిలో నాలుగున్నర ఏళ్లలో రూ.22కోట్లు అభివృద్ధి పనులు ప్రత్యక్షంగా, పరోక్షంగా జరిగాయని అన్నారు. కార్యక్రమంలో మండల కో ఆప్షన్ మెంబర్ షేక్ ఫరీద్, ఎంపిపి సుధాహ సనరావు, నియోజకవర్గ సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు మండల అంజయ్య, వైస్ ఎంపిపి రావు నెహ్రూ, లక్ష్మీ ప్రభాకరరావు, ఈఓపిఆర్డి మల్లికార్జునరావు, పంచాయతీ కార్యదర్శి కె విజయవర్ధిని పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వైసిపి నేతలు

గోడౌన్‌లో పరిశీలిస్తున్న లీగల్ మెట్రాలజీ అధికారులు

అధికారుల తనిఖీ

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని దేశాయిపేటలోని సివిల్ సప్లై గోదాంలో తూనికలు, కొలతల శాఖ అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. స్టాక్ రిజిస్టర్ ప్రకారం బియ్యం నిల్వలను పరిశీలించారు. 25టన్నుల బిమం నిల్వలు ఉన్నట్లు నిర్ధారించారు. ఈ సందర్భంగా లీగల్ మెట్రాలజీ జీ అసిస్టెంట్ కంట్రోలర్ పి లిల్లీ మాట్లాడుతూ సివిల్ సప్లై కమిషనర్ అరుణ్ కుమార్ ఆదేశాల మేరకు చీరాల ఎంఎల్ఎస్ పాయింట్ నందు తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బాపట్ల, చీరాల లీగల్ మెట్రాలజీ ఇన్స్పెక్టర్లు బి రామదాస్, కె నాగేశ్వరరావు, డిటి మాధవీలత పాల్గొన్నారు.

2కె రన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఓటు హక్కు ప్రాధాన్యతను గుర్తించాలి

కలెక్టర్ రంజిత్‌బాషా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఓటు హక్కు ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. ఓటు హక్కుపై నిర్వహించిన 2కె రన్ అవగాహన కార్యక్రమాన్ని కలెక్టర్ పచ్చజెండా ఊపి బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల పట్టణంలో వందలసంఖ్యలో విద్యార్థులు, యువతీయువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బాపట్ల మున్సిపల్ ఉన్నత పాఠశాల నుంచి ప్రారంభమైన 2కె రన్ పాత బస్టాండ్ సెంటర్, గడియార స్తంభం సెంటర్, అంబేద్కర్ విగ్రహం మీదుగా రథం బజార్, రైల్వే స్టేషన్ రోడ్డులో నుంచి తిరిగి మున్సిపల్ ఉన్నత పాఠశాల వరకు కొనసాగింది. విద్యార్థులు ప్లకార్డులు చేతబూని 18 సంవత్సరాల వయస్సు నిండిన వారంతా ఓటు హక్కు పొందాలని, ఓటు హక్కు విలువను గుర్తించాలంటూ పెద్ద ఎత్తున నినదించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుకు చాలా విలువ ఉందనే విషయాన్ని పౌరులంతా గుర్తించాలన్నారు. ప్రత్యేక సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా రూపొందించడానికి డిసెంబర్ 9వ తేదీ వరకు అభ్యంతరాలు, చేర్పులపై దరఖాస్తులు స్వీకరిస్తున్నామని వివరించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటు హక్కుపై విస్తతంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. 18 సంవత్సరాలు వయస్సు నిండిన వారు ఓటు హక్కు కొరకు విధిగా తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి పౌరుడు ఓటు హక్కు కలిగి ఉండాలని కోరారు. ప్రభుత్వం కల్పించే అవకాశాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఓటు హక్కు ప్రాధాన్యతను తెలియపరచడానికే 2కె రన్ పేరిట అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పి వెంకటరమణ, బాపట్ల ఆర్డీఓ జి.రవీందర్, ఓటర్ల అవగాహన కార్యక్రమాల ప్రత్యేక అధికారి రామారావు, మున్సిపల్ కమిషనర్ భాను ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఉద్యోగ భద్రత కల్పించాలని నిరసన

ప్రజాశక్తి-కనిగిరి

రాష్ట్రంలో వేలాదిగా వివిధ ప్రభుత్వ రంగాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ బుధవారం కనిగిరి ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ప్రైవేట్ ఏజెన్సీలను రద్దు చేయాలన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 10న విజయవాడలో జరుగు కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని పిలుపుని చ్చారు. కార్యక్రమంలో ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో వ్యాపారులకు ఇబ్బందులు

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

ప్రజాశక్తి-కనిగిరి

వైసిపి పాలనలో వ్యాపార వర్గాలు అన్ని రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని టిడిపి కనిగిరి ఇన్‌ఛార్జి ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పేర్కొన్నారు. కనిగిరి పట్టణంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి కనిగిరి ఇన్‌ఛార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో టిడిపి కార్యకర్తలు మినీ మేనిఫెస్టో ప్లకార్డులు చేతపట్టుకొని అమరావతి గ్రౌండ్స్ నుంచి పామూరు బస్టాండ్, చెక్ పోస్ట్, ఆర్టీసీ డిపో వద్దకు చేరుకొని.. అక్కడ నుంచి అమరావతి గ్రౌండ్స్ వద్దకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి కార్యకర్తలు దుకాణ సముదాయాలను, ఆ మార్గంలో ఉన్న ఇళ్ల వద్దకు వెళ్లి భవిష్యత్తు గ్యారెంటీ పథకాల గురించి అవగాహన కల్పించారు. పట్టణంలోని వ్యాపార వర్గాలను నేరుగా కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు టిడిపి అధికారంలోకి వస్తే వ్యాపార వర్గాలకు ఏ సమస్య వచ్చినా నేరుగా తనను కలవవచ్చని, చిత్తశుద్ధితో సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రాబోయేది తెలుగుదేశం ప్రభుత్వమేనని, టీడీపీ వస్తే అన్ని విధాలా అండగా ఉండి అభివద్ధి చేస్తానని మాట ఇస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, జనసేన నాయకులు, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

చిరు వ్యాపారితో మాట్లాడుతున్న డాక్టర్ ఉగ్ర

సోషల్ మీడియాలో..

అసభ్యకర పోస్టులు పెడతారా.?

- భూ దందాలు వెలుగులోకి తెచ్చాననే అక్కసు
- నా ఆరోపణలన్నీ నిజాలే...
- ప్రెస్‌మీట్‌లో పెద్దిరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం నియోజకవర్గంలో అక్రమ భూ దందా జరుగుతోందని, అన్యాక్రాంతమైన భూముల వివరాలు వెలుగులోకి తీసుకువస్తున్నాననే అక్కసుతో తనపై అసభ్యకరమైన పోస్టులు సోషల్ మీడియాలో పెడుతున్నట్లు వైసిపి అసమ్మతి నేత పెద్దిరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డి ఆరోపించారు. స్థానికంగా ఉన్న తన నివాస గృహంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తనపై సోషల్‌మీడియాలో అసభ్యకరంగా పోస్టులు పెట్టిస్తున్నది ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి సోదరుడు కృష్ణమోహన్‌రెడ్డి అని ఆరోపించారు. ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి కుటుంబీకులు బినామీ పేర్లతో భూములను కొల్లగొడున్న విషయం నిజమేనన్నారు. తన ప్రాణం పోయినా భయపడనని, భూ అక్రమాలను వెలుగులోకి తీసుకురావడం తథ్యమన్నారు. అక్రమాల ఫలితంగా 16 మంది రెవెన్యూ ఉద్యోగులు సస్పెండ్‌కు గురయ్యారన్నారు. ఇప్పుడు సబ్ రిజిస్ట్రార్లు కూడా సస్పెండ్ కావడం జరుగుతోందన్నారు. తాను చేసే ఆరోపణలు నిజం కాకపోతే ఎలాంటి చర్యలైనా తీసుకోవచ్చన్నారు. ఆరోపణలన్నీ ఆధారాలతో ఎక్కడకు వచ్చి నిరూపించమంటారో చెప్పాలని సవాల్ విసిరారు.

మాట్లాడుతున్న సూర్యప్రకాష్‌రెడ్డి

చక్రవర్తుల కాలం నాటి శాసనం గుర్తింపు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

విజయనగర సామ్రాజ్యాన్ని పరిపాలించిన మొదటి దేవరాయలు (1400 సంవత్సరాల నుండి 1422 సంవత్సరం వరకు) కాలం నాటి శిలాశాసనాన్ని చారిత్రక పరిశోధకులు తురిమెళ్ళ శ్రీనివాస ప్రసాద్ బుధవారం గుర్తించారు. యర్రగొండపాలెం మండలంలోని దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో గల పొన్నలబైలులోని చెంచు గూడెంలో గల చింతచెట్టు క్రింద శిలా శాసనాన్ని గుర్తించినట్లు ఆయన తెలిపారు. ఈ శాసనం చిత్రాలను సౌత్ ఇండియా ఆర్కియాలజీ డైరెక్టర్ కె మునిరత్నం నిర్ధారించినట్లు తెలిపారు. అలాగే ఇటీవలనే నల్లమల అటవీ ప్రాంతంలోని పునరావాస కాలనీకి చెందిన చెంచులు కృష్ణానది సమీపానికి చేపల వేటకు వెళ్లిన సమయంలో బంగారు నాణేలు లభించాయి. ఈ బంగారు నాణేలపై రోమ్ చక్రవర్తి బొమ్మను చిత్రీకరించి ఉన్నారు. దీంతో నల్లమల అటవీ ప్రాంతంలో విజయనగర రాజులు, రోమ్ చక్రవర్తులు ఇలా చాలా మంది ఈ ప్రాంతంలో రాజ్యాలు ఏర్పాటు చేసుకొని పాలించి ఉంటారని వృద్ధులు చెబుతున్నారు. పురావస్తు శాఖ వారు దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో సోదాలు నిర్వహిస్తే మరెన్నో ప్రాచీన కాలం నాటి విశేషాలు బయటపడతాయని చెబుతున్నారు.


గుర్తించిన శాసనం

మొగుళ్లపల్లి సర్పంచ్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మండలంలోని మొగుళ్లపల్లి గ్రామ పంచాయితీ పరిధిలో గల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా అందించి వారి సంక్షేమానికి విశేషంగా కృషి చేస్తున్న సర్పంచ్ కర్నాటి వెంకటేశ్వరరెడ్డి అభినందనీయుడని ఎంపిడివో వైవి నాగేశ్వర ప్రసాద్ తెలిపారు. బుధవారం మొగుళ్లపల్లి గ్రామ సచివాలయంలో వికాసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కర్నాటి వెంకటేశ్వరరెడ్డిని శాలువలు, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఎంపిడిఓ నాగేశ్వరప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు అన్ని రంగాల్లో అమలు చేస్తున్నాయన్నారు. ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యమై అభివృద్ధి చెందిన భారతదేశం రూపకల్పన చేయాలని తెలిపారు. సంక్షేమ పథకాల ప్రయోజనాలను, ఆరోగ్య సంరక్షణ, స్వచ్ఛమైన తాగునీరును పొందుటకు, ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన పథకం తదితర పథకాలకు వివరించారు. ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంకా గ్రామ రైతులైన బొట్ల యోగయ్య, కేశనపల్లి ముసలయ్యలను సన్మానించారు. కార్యక్రమంలో వెంకటాద్రిపాలెం వైద్యాధికారి డాక్టర్ కోటా నాయక్, ఏపీవో శైలజ, డిడివో రామారావునాయక్, కార్యదర్శి వెంకటశివమ్మ, వాలంటీర్ శివరామిరెడ్డి పాల్గొన్నారు.


సర్పంచ్‌కు సన్మానం చేస్తున్న దృశ్యం

నేడు, రేపు ఎంపీ మాగుంట పర్యటన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి జిల్లాలో ఈ నెల 30, డిసెంబర్ 1వ తేదీ పలు కార్యక్రమాలలో పాల్గొననున్నారు. ఈ నెల 30న ఉదయం 8 గంటలకు ఒంగోలు మాగుంట కార్యాలయంలో కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. 10 గంటలకు ఒంగోలు నగరం కొప్పోలు - గుత్తికొండవారిపాలెం గ్రామాల మధ్య ఉన్న పోతురాజు కాలువపై కొత్తగా నిర్మించిన వంతెన ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. 11 గంటలకు శింగరాయకొండ మండలం పాకాల గ్రామంలో కేంద్ర ప్రభుత్వ వికసిత్ "వికాసిత్ భారత్ సంకల్ప్ యాత్ర" కార్యక్రమానికి హాజరవుతారు. మధ్యాహ్నం ఒంటి గంటలకు మార్కాపురంలో పలు కార్యక్రమాలలో స్థానిక శాసనసభ్యులతో కలసి పాల్గొంటారు. సాయంత్రం ఐదు గంటలకు ఒంగోలులో పివిఆర్ మునిసిపల్ హైస్కూలు ఆవరణలో మాగుంట సుబ్బరామన్న 28వ వర్ధంతి సందర్భంగా అభిమానులు ఏర్పాటుచేసిన సంస్మరణ సభ, అన్నదాన ఏర్పాట్లను ఒంగోలు ఎంపీ మాగుంట పరిశీలిస్తారు. సాయంత్రం ఆరు గంటలకు ఒంగోలులో ప్రభుత్వ సర్వజన వైద్యశాల మెడికల్ కాలేజి సమావేశ మందిరంలో జరిగే వైద్యశాల అభివద్ధి సొసైటీ సమావేశంలో పాల్గొంటారు. రాత్రి ఎనిమిది గంటలకు ఒంగోలు మాగుంట కార్యాలయంలో కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. డిసెంబర్ ఒకటో తేదీ ఉదయం 8 గంటలకు ఒంగోలులో మాగుంట సుబ్బరామరెడ్డి 28వ వర్ధంతి సందర్భంగా వివిధ ప్రదేశాలలో మాగుంట అభిమానులు ఏర్పాటు చేయు విగ్రహాలకు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు. పివిఆర్ బాలుర మునిసిపల్ హైస్కూలు ఆవరణలో నిర్వహించు సంస్మరణ సభ, అన్నదాన ఉచిత మెగా వైద్య శిబిర నిర్వహణ కార్యక్రమాలలో పాల్గొంటారు. ఉదయం 9.30 గంటలకు ఒంగోలు ప్రకాశం భవనం నుండి జిల్లా యంత్రాంగం నిర్వహించే ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ ర్యాలీలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2.30 గంటలకు ఒంగోలు మాగుంట కార్యాలయంలో కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు.

మాట్లాడుతున్న డీఎస్పీ రామరాజు

చెడు వ్యసనాలకు బానిస కావొద్దు..

డీఎస్పీ రామరాజు

ప్రజాశక్తి-కనిగిరి

డ్రగ్స్, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైమ్స్‌పై కనిగిరి పట్టణంలోని ఎంఎస్ఎం డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు బుధవారం డిఎస్పీ రామరాజు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని, చెడు వ్యసనాలకు బానిస కావద్దని సూచించారు. కార్యక్రమంలో కనిగిరి సీఐ శివరామకష్ణారెడ్డి, ఎస్ఐ మాధవరావు, కళాశాల కస్పాండెంట్ ఏలూరి సుబ్బారావు పాల్గొన్నారు.

పేదలకు 116 ఎకరాలు పంపిణీ

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి నియోజకవర్గంలోనీ కనిగిరి, పీసీపల్లి, వెలిగండ్ల, సి.యస్.పురం మండలాలకు సంబందించిన భూమి లేని 88 మంది పేదలకు అసైన్మెంట్ కమిటీ ద్వారా శాంక్షన్ అయిన 116 ఎకరాలకు సంబంధించిన భూహక్కు పట్టాలను ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ బుధవారం ఆర్డీఓ కార్యాలయంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో పాలపర్తి జాన్‌ఇర్విన్, మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, వైసిపి నాయకులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి: ఎంఎల్ఎ గొట్టిపాటి

ప్రజాశక్తి - అద్దంకి

టిడిపి పాలనతోనే రాష్ట్ర ప్రజలకు భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. పట్టణంలోని 5వ వార్డు రాజీవ్ కాలనీలో బాబు షురిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాలను ప్రజలకు వివరించారు. బాబు గ్యారెంటీ కార్డులను అందజేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే మహాశక్తి, అన్నదాత, యువగళం, బీసీలకు రక్షణ చట్టం, ఇంటింటికి రక్షిత నీటి పథకంతో పాటు పూర్ టు రిచ్ కార్యక్రమాలు అమలు చేస్తామని అన్నారు. పేదల పేదల కడుపు నింపడం కోసం చంద్రబాబు తెచ్చిన అన్నా క్యాంటీన్లు, పండుగలకు ఇచ్చిన కానుకలు, పెళ్ళికానుకలు వంటి పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. అలాంటి పథకాలను రద్దు చేసిన జగన్‌రెడ్డి పేదల పక్షపాతి ఎలా అవుతారని ప్రశ్నించారు. విద్యుత్, ఆర్టీసీ చార్జీలు పెంచి పేదలని దోచుకుంటున్న జగన్ ఇంకా పేదల మనిషని చెప్పుకునే అర్హత లేదని అన్నారు. జగన్‌రెడ్డిని గద్దెదించేందుకు అన్ని వర్గాల ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. టిడిపి ప్రభుత్వంలో కట్టిన టిడ్కో ఇళ్లను పేదలకు ఇవ్వలేని చేతగాని చెత్త సిఎం అని ఆరోపించారు. జగన్‌రెడ్డి వచ్చాక పేదల సొంతింటి కల పెనుభారంగా మారిందని అన్నారు. అధికారం కోసం అబద్దాలు చెప్పి ఇప్పుడు పేదలను మోసం చేస్తున్నాడని అన్నారు. పేదల సొంతింటి కల నెరవేర్చడం కోసం టిడిపి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 3,13,832లక్షల గృహాలు 90శాతం పూర్తి చేసిందని అన్నారు. అందులో భాగంగా మొదటిదశలో అద్దంకి నగర పంచాయతీలోని శింగరకొండ వద్ద వెయ్యికిపైగా టిడ్కో ఇళ్ల నిర్మాణాలు 90శాతం పనులు పూర్తి చేశామని, వైసిపి అధికారానికి వచ్చిన తర్వాత మిగిలిన 10శాతం పనులు పూర్తి చేయకుండా పేదలను మోసం చేశాడని ఆరోపించారు. పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు శాశ్వత మంచినీటి పథకానికి టిడిపి హయాంలో తాను రూ.84కోట్లు మంజూరు చేయించానని అన్నారు. నేటికీ పనులు పూర్తి చేయలేని జగన్ ప్రభుత్వం ప్రజపట్ల బాధ్యత ఏమిటో అర్ధం చేసుకోవాలని కోరారు. గుండ్లకమ్మ నుండి శింగరకొండ టిడ్కో గృహాల వరకు నీటిని అనుసంధానం చేస్తూ ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి ప్రతిపాదించి తాను నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. గడిచిన నాలుగేళ్లలో వైసిపి కేవలం 5 ఇళ్లు మాత్రమే నిర్మించినట్లు గత ఆగస్టులో పార్లమెంట్ సమావేశాల్లో కేంద్రమంత్రి తెలిపారని గుర్తు చేశారు. టిడిపి ప్రభుత్వం నిర్మించిన టిడ్కో ఇళ్లను చూపించి మరో రూ.4వేల కోట్ల అప్పుకోసం వైసిపి జగన్ ప్రయత్నించడం సిగ్గుచేటని అన్నారు. టిడిపి ప్రభుత్వం రూ.4,600కోట్ల ఖర్చుతో 3.20లక్షల ఇళ్ళు నిర్మించినట్లు తెలిపారు. జగన్ వచ్చాక ఎస్సీ కార్పొరేషన్ నిర్వీర్యం చేసి రూ.28,147కోట్ల సబ్ ప్లాన్ నిధులను దారిమళ్లించి తీరని అన్యాయం చేశారని అన్నారు. కరోనా సమయంలో మాస్క్ అడిగినందుకు డాక్టర్ సుధాకర్‌ను పిచ్చోడిని చేసి చంపారని అన్నారు. మద్యం రాబడిని ఆదాయంగా చూపించుకొని అప్పులు తెచ్చుకోవడమే మద్యపాన నిషేధమా అని ప్రశ్నించారు. మద్యం నిషేధిస్తామని మహిళలను మోసం చేశాడని అన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి పెరగడంతో మహిళలకు రక్షణ కరువైందని అన్నారు. హత్యలు, మానభంగాలు నిత్యకృత్యంగా మారాయని అన్నారు.

ఇంటింటికీ టిడిపి కార్యక్రమంలో ఎంఎల్ఎ గొట్టిపాటి రవి

సిట్ బృందం దర్యాప్తు వేగవంతం

- ఆరోపణలు ఎదుర్కొంటున్న వాళ్లు ఊర్లు విడిచిపెట్టి వెళుతున్న వైనం
- భూ అక్రమార్కులను వెంటాడుతున్న అరెస్టు భయం
- ముందస్తు బెయిల్ కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించే యత్నాలు

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

తప్పుడు దస్త్రాలను సృష్టించి అడ్డగోలుగా భూ ఆక్రమాలకు పాల్పడుతున్న వారి ఆట కట్టించేందుకు జిల్లా కేంద్రమైన ఒంగోలు, మార్కాపురంలో ఏర్పాటు చేసిన సిట్ (ప్రత్యేక దర్యాప్తు బృందం) బృందం దర్యాప్తు వేగం పెంచింది. దీంతో ఆక్రమాలకు పాల్పడిన అధికారులు, ప్రజాప్రతినిధుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఎప్పుడు ఏమి జరుగుతుందోనన్న భయంతో కాలం వెళ్లదీస్తున్నారు. దర్యాప్తులో భాగంగా సిట్ బృందం అధికారులు కార్యాలయాలకు చేరుకొని తమకు కావాల్సిన దస్త్రాలను పరిశీలిస్తున్న క్రమంలో ప్రజాప్రతినిధుల నుండి సదరు అధికారులకు ఫోన్‌ల మీద ఫోన్‌లు వస్తున్నాయి. ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ తమ ప్రమేయం ఏదైనా ఉన్నట్లు తెలిస్తే ముందస్తు సమాచారం ఇవ్వవలసినదిగా అధికారులను వేడుకొంటున్నారు. ఇటీవల కాలంలో మార్కాపురం పట్టణంలోని సర్వే నెం.299/2సిలో య.1-08 సెంట్ల భూమికి తప్పుడు దస్త్రాలను సృష్టించి ఎనివేర్ కింద యర్రగొండపాలెం సబ్ రిజిష్ట్రర్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఒక ముఠా పథకం ప్రకారమే పూర్తిచేసింది. మార్కాపురం పట్టణంలో ఉన్న ఈ ఆస్తికి సంబంధించి రిజిస్ట్రేషన్‌కు స్టాంపు డ్యూటీ కింద సదరు ఆస్తికి రూ.35లక్షల మేర నగదును రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు చెల్లించారంటే ఆ ఆస్తి విలువ ఎంత ఉంటుందో అర్ధం చేసుకోవచ్చు. అధికారమే అండగా తప్పుడు ధృవీకరణ పత్రాలను, తప్పుడు వ్యక్తులను సృష్టించి కోట్ల రూపాయల ఆస్తిని కాజేయటమే ఈ ముఠా పనిగా పెట్టుకుంది. అక్రమార్జనకు అలవాటు పడిన కొంత మంది ప్రభుత్వ అధికారులను ఎంచుకొని వారి సహాయ సహకారాలతో యథేచ్ఛగా భూములను ఆక్రమించేశారు. అసలైన భూమి యాజమానులు సుదీర్ఘ కాలంగా ఈ ముఠా చేస్తున్న అరాచకాలపై న్యాయ పోరాటం చేస్తూ సఫలీకృతులయ్యారు. తమ ఆస్తికి ఏ విధంగా తప్పుడు దస్త్రాలు సృష్టించారో ఆధారాలతో సహా సంబంధిత అధికారుల కార్యాయాలకు వెళ్లి కళ్లకు కట్టినట్లు చూపించారు. బాధితులు సాక్ష్యాలతో సహా చూపించడంతో వెంటనే అధికారులు దిద్దుబాటు చర్యలు ప్రారంభిస్తున్నారు. అక్రమాలకు పాల్పడిన రుజువులను అధికారులు తీస్తుండటంతో భూ అక్రమార్కులను అరెస్టు భయం వెంటాడుతోంది. కొందరు ముందస్తు బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించే పనిలో ఉన్నట్లు సమాచారం. ఈ మొత్తం వ్యవహారంలో కొందరు అధికారులపై మాత్రమే చర్యలు తీసుకుంటున్నారు తప్ప ఈ ముఠాకు చెందిన అధికార పార్టీ నేతల భరతం పట్టడంలో సిట్ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారనే విమర్శలున్నాయి.

ప్రజల జీవితాలతో జగన్ చెలగాటం

ప్రజాశక్తి- మద్దిపాడు

రాష్ట్ర ప్రభుత్వం ప్రజల జీవితాలతో ఆడుకుంటుందని టిడిపి మండల అధ్యక్షులు మండవ జయంత్ బాబు అన్నారు. మండలంలోని అన్నంగి గ్రామంలో బుధవారం రాత్రి వైసీపీని తరిమికొట్టండి, బాబు షురిటీ, భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్ళి ఫోన్లో షురిటీలో కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేశారు. జయంత్ బాబు మాట్లాడుతూ చౌకబారు మద్యం అధిక ధరలకు అమ్ముతూ ప్రజల ఆరోగ్యంతో వ్యాపారం చేస్తున్నారని మండిపడ్డారు. టిడిపి అధికారానికి వస్తే అమలు చేయబోయే పథకాలను వివరించారు. ఆడబిడ్డ నిధి కింద 18ఏళ్లు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ.1500, తల్లికి వందనం పథకం క్రింద ప్రతి ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుతుంటే అంతమందికి ఏడాదికి రూ.15వేలు ఖాతాల్లో జమ చేస్తారని తెలిపారు. దీపం పథకం కింద ప్రతి కుటుంబానికి ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేస్తామని అన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం, ప్రతి ఇంటికి కుళాయి ద్వారా సురక్షిత మంచినీటి సరఫరా, అన్నదాత పథకం ద్వారా ప్రతి రైతుకు ఏడాదికి రూ.20వేలు ఆర్థిక సహాయం, యువగళం నిధి కింద ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3వేల భృతి, బీసీలకు రక్షణ చట్టం తెచ్చి అన్ని విధాల వారికి అండగా నిలుస్తామని పేర్కొన్నారు. పూర్ టు రిచ్ పథకం ద్వారా పేదలను సంపన్నులుగా మార్చే కార్యక్రమం అమలు చేస్తామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో అరాచక, అవినీతి, అక్రమాల వైసిపి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు నారిపెద్ది అనిల్, క్లస్టర్ ఇంచార్జి దేవబత్తిన ప్రసాదరావు, యూనిట్ ఇంచార్జ్ ముళ్ళూరి మురళి, మండవ గోపి చంద్, చింతల శ్రీను, మాజీ ఎంపీటీసీ పొద కొండయ్య, అన్నాబత్తిన శివ, అన్నాబత్తిన హనుమంతరావు, రాయపాటి రమేష్ బాబు, నల్లూరి సురేష్, కొమ్మాలపాటి సుబ్బారావు, నారా సురేష్, నలమోతు బాబూ, అన్నాబత్తిన పవన్, ఐటీడీపీ నాగరాజు, రాయపాటి హనుమంతరావు, మాదాల లక్ష్మీనారాయణ, బుర్రి బసవయ్య, కటారి రామారావు పాల్గొన్నారు.

మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

సంక్షేమ పదకాల బ్రోచర్‌ను అందజేస్తున్న వైసిపి నేతలు

ప్రతి ఇంటికీ సంక్షేమం

ప్రజాశక్తి - చీరాల

పట్టణంలోని 1వ వార్డ్ సచివాలయ పరిధిలో జగనన్నే మరలా ఎందుకు కావాలి అనే కార్యక్రమం బుధవారం నిర్వహించారు. వార్డులో ప్రతి గడప గడపకు వెళ్ళి గడిచిన నాలుగేళ్లలో అమలు జరిగిన సంక్షేమ, అభివృద్ధి వివరాల బ్రోచర్స్ లను పంపిణీ చేశారు. ప్రతి కుటుంబానికి అందిన సంక్షేమాన్ని గుర్తించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో అభివృద్ధి సంక్షేమం కోసం మరోసారి జగన్మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని కోరారు. వార్డులో వైసిపి జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైసిపీ పట్టణ అధ్యక్షుడు కోండ్రు బాబ్జీ,1వ వార్డ్ ఇంచార్జ మల్లి రామకృష్ణ, జేసిఎస్ మండల కన్వీనర్ కోలా శివకృష్ణ, వార్డు నాయకులు రత్నబాబు, సాగర్, బొమ్మల నాని, సురేష్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

చెస్ పోటీల్లో తిరుపతి ఫస్ట్

బాల్ బ్యాడ్మింటన్ విజేత నైరా కళాశాల

ప్రజాశక్తి - బాపట్ల

చెస్ ఆడుతున్న క్రీడాకారులు

ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అంతర అనుబంధ కళాశాలల ప్రథమ దశ క్రీడా పోటీల్లో విజేతల వివరాలను కళాశాల అసోసియేట్ డీన్ వి .శ్రీనివా సరావు బుధవారం విలేకరులకు తెలిపారు. 2రోజుల పాటు జరిగిన ఆటల పోటీల్లో చెస్ పోటీలో తిరుపతి కళాశాల విజేతగా నిలిచింది. బాపట్ల వ్యవసాయ కళాశాల రన్నర్ కాగా, నైరా వ్యవసాయ కళాశాల, తిరుపతి ఎస్‌వి వ్యవసా య కళాశాల మధ్య జరిగిన బాల్ బాడ్మింటన్ ఫైనల్ పోటీ లో నైరా కళాశాల ప్రథమ స్థానంలో నిలిచింది. తిరుపతి కళాశాల ద్వితీయ స్థానం దక్కించుకుంది. వాలీబాల్ పోటీల్లో బాపట్ల వ్యవసాయ కళాశాల, నైరా వ్యవసాయ కళాశాల ఫైనల్స్‌కు చేరుకున్నాయి. కారమ్స్‌లో తిరుపతి ఎస్‌వి వ్యవసాయ కళాశాల, ఎచ్చర్ల కింజరాపు ఎర్రన్నా యుడు కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్స్ ఫైనల్స్‌కు చేరుకు న్నాయి. బాస్కెట్ బాల్ పోటీలో తిరుపతి ఎస్‌వి వ్యవసాయ కళాశాల, నైరా వ్యవసాయ కళాశాల ఫైనల్స్‌కు చేరుకోగా, టేబుల్ టెన్నిస్ పోటీలో బాపట్ల వ్యవసాయ కళాశాల ఫైనల్స్‌కు చేరుకున్నట్లు వివరించారు. క్రీడలను విశ్వ విద్యాలయ పిడి ఆర్ రవికాంత్‌రెడ్డి, ఆఫీసర్ ఇంచార్జి ఆఫ్ స్టూడెంట్ యాక్టివిటీస్ టివి శ్రీధర్ పర్యవేక్షించారు.

రికార్డులు తగలబెట్టిన ఉద్యోగి అరెస్టు

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

ఇంకొల్లు మేజర్ పంచాయతి కార్యాలయంలో రికార్డులు తగులబెట్టిన కేసులో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న అంగలకుదురు చైతన్యను ఎస్ఐ నాయబ్‌రసూల్ బుధవారం అరెస్టు చేశారు. పెట్రోలు పోసి రికార్డులు తగులబెట్టినట్లు స్వయంగా ఒప్పుకున్నాడని అన్నారు. పంచాయతిలో కొన్ని అవకతవకలు జరిగిన నేపథ్యంలో పంచాయతి సెక్రటరి మోహన్‌బాబును సస్పెండ్ చేసిన ఉన్నతాధికారులు చైతన్యకు షోకాజ్ నోటీసులు అందజేశారు. దీంతో ఆందోళనకు గురైన చైతన్యపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటారేమోనని ముందుగానే ఇంకొల్లు నుండి చీరాల డివిజనల్ కార్యాలయానికి డిప్యుటేషన్‌పై వెళ్ళేందుకు ఆర్డర్ కాపీని తీసుకొని ఇంకొల్లు ఇఓ పిఆర్‌డి, ఎంపిడిఓల అనుమతి కోరగా కొత్త సెక్రటరి వచ్చాక రికార్డులు అప్పగించిన తరువాత బదిలీ చేస్తామని తేల్చి చెప్పారు. దీంతో ఏమి చేయాలో పాలుపోక రికార్డులు తగులబెట్టి సాక్షాలు లేకుండా చేస్తే తనపై విచారణ ఉండదని భావించి పెట్రోలు పోసి నిప్పంటించినట్లు తన విచారణలో తేలిందని ఎస్ఐ అన్నారు. దీంతో చైతన్యను అరెస్టు చేసి పర్చూరు కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

ఆర్థిక సహాయం అందజేస్తున్న వైసిపి నాయకులు

బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - చీరాల

మండలం వాడరేవు పంచాయతీ పరిధిలో పాకాల ఏరియా ఇటీవల అగ్ని ప్రమాదానికి గురైన మూడు ఇల్లు కాలిపోయాయి. బాధితులకి నష్టపరిహారం చొప్పున స్థానిక శాసన సభ్యులు కరణం బలరామ కృష్ణమూర్తి, వైసిపీ ఇంచార్జీ కరణం వెంకటేష్ తరుపున ఒక్కొక్కరికి రు.10వేల నగదు అందజేశారు. ప్రభుత్వం నుంచి గృహ నిర్మాణాలు, వలలు, నష్ట పరిహారం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ జంజన శ్రీనివాసరావు, అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, వైసిపీ అధ్యక్షులు ఆసాది అంకాలరెడ్డి, మాజీ సర్పంచ్ ఎరిపిల్లి రమణ, మచ్చా సువార్త, అక్కల శ్రీనివాస రెడ్డి, చేపల గాలి, కె రాము, గవిని నారాయణ, శ్రీనివాస రావు, కావూరి యదలారెడ్డి, రామచంద్రరావు, తేళ్ల రాంబాబు పాల్గొన్నారు.

సర్పంచ్ లేక..సమస్యలు పరిష్కారం కాక..

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని వెల్లటూరు పంచాయతీ కార్యాలయానికి ప్రస్తుతం సర్పంచులు లేకపోవడంతో ప్రజలు వివిధ రకాల పనులపై వచ్చి తిరిగి వెళుతూ నానా అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం ఉన్న సర్పంచ్ చౌటూర్ లక్ష్మి రాజీనామా చేయటంతో సర్పంచ్ పదవి ఖాళీ అయింది. రాజీనామా చేసి 20రోజులు గడుస్తున్నప్పటికీ ఉన్నతాధి కారులు ఏ ఒక్కరికి బాధ్యతలు అప్పగించలేదు. దీంతో పంచాయతీలో జరగవలసిన వివిధ రకాల కార్యకలాపాలు నిలిచిపోతున్నాయని వాపోతున్నారు. గత పంచాయతీ ఎన్నికల్లో వెల్లెటూరు పంచాయతీ ఎస్టీ రిజర్వేషన్ అయ్యింది. దీంతో గ్రామంలోని టిడిపి, వైసిపి వర్గీయులకు సంబంధించిన ఎస్టీ వర్గాల వారు పోటీ చేస్తే ఇరువురికి ఆర్థిక భారం అవుతుందని, ఇరు పార్టీల నేతలు సమన్వయపరిచారు. రెండున్నరేళ్లు చొప్పున ఇరువర్గాలకు ఒప్పందం కుదుర్చారు. దీంతో తొలుత వైసిపి వర్గానికి చెందిన చౌటూరు లక్ష్మీ రెండున్నర సంవత్సరాలు అనంతరం ఉప సర్పంచ్ బొజ్జ రవి మరో రెండున్నరేళ్ళు సర్పంచ్ పదవిలో కొనసాగే విధంగా ఒప్పందం కుదిరింది. ఒప్పందం ప్రకారం చౌదరి లక్ష్మి ఈనెల 10న సర్పంచి పదవికి రాజీనామా చేసి లేఖను ఎంపీడీఒకు అందజేశారు. దీనికి సంబంధించిన ప్రతులను

సర్పంచి లేని వెల్లటూరు పంచాయితీ కార్యాలయం

జిల్లా పంచాయతీ అధికారులకు అందించారు. అయితే ఉప సర్పంచ్‌గా ఉన్న రవికి సర్పంచ్ బాధ్యతలు అప్పగించాల్సి ఉండగా ఆ మేరకు ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పంచాయతీలో నేటికీ సర్పంచి లేక జరగవలసిన కార్యక్రమాలు నిలిచిపోతున్నాయని పలువురు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

సర్పంచి పదవిపై సమన్వయ లోపం

వేల్లటూరు పంచాయతీకి మిగిలిన రెండున్నర సంవత్సరాల పాలన కొనసాగించేందుకు సర్పంచి పదవికై ఉప సర్పంచిగా ఉన్న బొజ్జ రవితో పాటు అదే సామాజిక వర్గానికి చెందిన మరో వార్డు సభ్యురాలు పోటీ పడుతున్నట్లు తెలిసింది. దీంతోఎవరు సర్పంచి పదవి కోసం ముందుకు వెళ్లాలనే కోణంలో ఆలోచించుకుంటూ కాలయాపన జరుగుతున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ప్రజల ఓట్లతో గెలుపొందిన సర్పంచి పదవికి రాజీనామా చేస్తే తదనంతరం ఉన్నతాధికారులు ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చి మరో మారు ఎన్నికలు జరిపి సర్పంచిని ఎన్నుకోవాల్సి ఉంది. కానీ 20రోజులు గడుస్తున్నప్పటికీ పంచాయతీలో ఉన్న ఉపసర్పంచికి తాత్కాలిక బాధ్యతలు అప్పగించటం గాని లేదా మరో మారు నోటిఫికేషన్ జారీ చేసి ఎన్నికల నిర్వహించడం కానీ ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో పాలన నిలిచిపోయిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంటే అప్పటివరకు ఉప సర్పంచికి తాత్కాలిక బాధ్యతలు ఇవ్వాల్సి ఉంది. ఆ మేరకు ఉన్నతాధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి గ్రామంలో నెలకొన్న అనిచ్చితి పరిస్థితి దృష్ట్యా సర్పంచి పదవిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి ఏ రామ్ కుమార్ మాట్లాడుతూ సర్పంచిగా లక్ష్మి రాజీనామా చేసిన విషయాన్ని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకు వెళ్ళామని ఉన్నతాధికారుల నుండి తగిన ఆదేశాలు రావాల్సి ఉందన్నారు.

దళిత శంఖారావంకు హాజరైన టిడిపి కార్యకర్తలు

టిడిపి దళిత శంఖారావం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఉమ్మడి గుంటూరు జిల్లా టిడిపి కార్యాలయంలో బుధవారం జరిగిన దళిత శంఖారావం కార్యక్రమంలో టిడిపి మండల దళిత నాయకులు పాల్గొన్నారు. టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కనపర్తి సుందర్రావు ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల నుండి, వేమూరు నియోజకవర్గంలో టిడిపి దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు. వైసిపి అంతం టిడిపి పంతం అనే నినాదంతో జరిగిన కార్యక్రమం ద్వారా దళితులంతా ఐకమత్యంగా ఉండి వైసీపీని ఓడించేందుకు సిద్ధపడాలని సుందరావు కోరారు.

ప్రయోగాత్మకంగా వరి నూర్పిడి చేస్తున్న వ్యవయాధికారి

వరి కోత ప్రయోగం

ప్రజాశక్తి - చెరుకుపల్లి

మండలంలోని కావూరు రెవెన్యూ గ్రామ పరిధిలోని తుమ్మలపాలెం గ్రామంలో వరి పంట కోత ప్రయోగం బుధవారం నిర్వహించారు. 25మీటర్ల విస్తీర్ణంలో నిర్వహించిన వరి పంట కోత ప్రయోగంలో 20.050కేజీల దిగుబడి వచ్చినట్లు, ఇది ఎకరాకు 35నుండి 40బస్తాల దిగుబడి అంచనా వేసినట్లు వ్యవసాయ అధికారి టి బాలాజీ గంగాధర్ తెలిపారు. కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లైఫ్ ఇన్సూరెన్స్ ప్రతినిధులు, మండల వ్యవసాయ శాఖ సిబ్బంది, ఏఈఒలు ప్రియాంక, మాధవి పాల్గొన్నారు. తుఫాను హెచ్చరికల నేపథ్యంలో మంత్రాల ద్వారా వరి కోతలు కొనసాగించాలని ఎఒ తెలిపారు. బంగాళా ఖాతంలో తుఫాను ఏర్పడే అవకాశం ఉన్నందువలన భారీ వర్షాలు రానున్నాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఎవరైనా వరి కోతలు కోయాలనుకుంటే యంత్రాల ద్వారా మాత్రమే కోయాలని సూచించారు. వీలుకానట్లయితే వాయిదా వేసుకోవాలని చెప్పారు. డిసెంబర్ 2నుండి 6వరకు భారీ వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందువలన వీలైతే పంట కోతలు వాయిదా వేసుకోవాలని సూచించారు.

సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా పావులూరి

ప్రజాశక్తి - భట్టిప్రోలు (వేమూరు)

వేమూరు నియోజకవర్గ సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా అమృతలూరు మండలం పాంచాలవరం సర్పంచ్ పావులూరి హేమ చంద్ ఎన్నికయ్యారు. మాజీ మంత్రి, టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబును ఆయన కలిసి బుధవారం కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచులు సంఘం అధ్యక్షుడిగా సర్పంచుల సమస్యలపై నిరంతరం పోరాడి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని హేమచంద్‌కు సూచించారు. ఈ మేరకు నూతనంగా ఎన్నికైన హేమచెంద్‌ను శాలువాతో సత్కరించారు. పంచాయతీల నిధులన్నీ ప్రభుత్వం దోచుకుని పంచాయతీలను నిర్వీర్యం చేసిందని అన్నారు. పంచాయతీలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేయడానికి వీలు లేదని సర్పంచులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. దీనిపై అందరితో సమీక్షించి తగిన న్యాయం జరిగే విధంగా చూడాలని సూచించారు. ఆయన వెంట టిడిపి మండల అధ్యక్షులు వెన్న బెనర్జీ ఉన్నారు.

హేమచంద్‌ను అభినందిస్తున్న మాజీ మంత్రి ఆనందబాబు

సుప్రీంకోర్టు వ్యాఖ్యలపై వక్రీకరణ

- చంద్రబాబును అడ్డుకునేందుకు జగన్ కుట్ర
- ప్రజాక్షేత్రంలో జగన్‌కు గుణపాఠం తప్పదు
- ఎమ్మెల్యే ఏలూరి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

చంద్రబాబు పబ్లిక్ మీటింగులలో పాల్గొనరాదని సుప్రీంకోర్టు చెప్పినట్లు నీలి మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తున్నారని, ఆ మీడియా సంస్థ దిగజారుడుతనానికి నిదర్శనమని టిడిపి బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు విమర్శించారు. చంద్రబాబును రాజకీయ కార్యక్రమాలకు దూరంగా ఉంచాలన్న సీఐడి వాదనను సుప్రీంకోర్టు తిరస్కరించిందని అన్నారు. బెయిల్ రద్దుపై వెంటనే విచారణ చేపట్టాలన్న సీఐడి వాదనను సుప్రీంకోర్టు తిరస్కరించిందని అన్నారు. అయినా నీలి మీడియా ఆయా అంశాలను వక్రీకరించి తప్పుడు స్క్రోలింగ్ ఇచ్చిందన్నారు. చంద్రబాబు రాజకీయ కార్యకలాపాలపై సుప్రీంకోర్టు ఆంక్షలు విధించలేదని అన్నారు. సభలు, ర్యాలీలు జరుపుకోవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందన్నారు. జగన్ రెడ్డి ఎందుకు చంద్రబాబును ప్రజల్లోకి వెళ్లకుండా అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని ప్రశ్నించారు. నీలి మీడియాలో తప్పుడు ప్రచారం ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. పబ్లిక్ మీటింగ్స్ పాల్గొనరాదని సుప్రీంకోర్టు చెప్పినట్టు అబద్దపు స్క్రోలింగ్స్ ఇవ్వడాన్ని తప్పుపట్టారు. కేవలం స్కిల్ కేసుకు సంబంధించి మాత్రమే ఇరుపక్షాలు మాట్లాడవద్దని సుప్రీంకోర్టు చెప్పిందన్నారు. చంద్రబాబు పర్యటనలను అడ్డుకునేందుకు సీఐడి ద్వారా అడ్డుకునే కుట్ర జగన్‌రెడ్డి చేస్తున్నారని మండిపడ్డారు. మేనిఫెస్టోలోని హామీలు అమలుచేసి ఉంటే చంద్రబాబును ఎందుకు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ప్రశ్నించారు. లక్షల కోట్ల అవినీతికి పాల్పడకుంటే భయమెందుకని అన్నారు. అవినీతిని కప్పిపెట్టుకునేందుకు జగన్‌రెడ్డి వ్యవస్థల్ని మేనేజ్ చేసి సీఐడీతో అక్రమ కేసులు పెట్టించారని ఆరోపించారు. ప్రజాక్షేత్రంలో జగన్‌కు గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

ఎంఎల్ఎ సాంబశివరావు

నాలుగు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

ప్రజాశక్తి - వేటపాలెం

అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను ఎస్ఐ జి సురేష్ 216 జాతీయ రహదారిపై వెళుతున్నాయని గమనించి అదుపులోకి తీసుకొని తన సిబ్బందితో మూడు ట్రాక్టర్లను వేటపాలెం పోలీస్ స్టేషన్‌కు బుదవారం తరలించారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

పోలీసు స్టేషన్‌లో ఇసుక అక్రమ రవాణ ట్రాక్టర్లు

రైతులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు (వేమూరు)

ఎఒ సునీత

బంగాళా ఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో డిసెంబర్ 2నుండి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరిస్తున్న దృష్ట్యా రైతులు అప్రమత్తంగా ఉండాలని వేమూరు ఎఒ సునీత సూచించారు. అమె మాట్లాడుతూ డిసెంబర్ 5 వరకు జిల్లాలో ఒక మోస్తరు నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లుగా వాతావరణ కేంద్రం తెలిపిందని అన్నారు. కోతకు సిద్దంగా ఉన్న వరి పొలాల్లో రైతులు పంటలను జాగ్రత్త పరుచుకొని ఇంటికి చేర్చుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. వరి పంటకు తీవ్ర నష్టం జరిగే సూచనలు ఉన్నట్లుగా హెచ్చరించారు. సిద్ధంగా ఉన్నపంటలను హార్వెస్టర్ వినియోగించుకునైనా కాపాడుకునేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

ప్రజాశక్తి - పర్చూరు

వృధ్ధురాలి మెడలో గొలుసు అపహరించి ద్విచక్రవాహనంపై ఉడాయించిన సంఘటన మండలంలోని బోడవాడలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామంలో విశ్రాంత విడిఓ పుల్లెల సత్యనారాయణ, సరోజిని దంపతులు నివాసం ఉంటున్నారు. సాయంత్రం సమయంలో భర్త వాకింగ్‌కు వెళ్ళటం గుర్తించిన దుండంగులు చోరీకీ పాల్పడ్డారు. తెలిసిన వ్యక్తిలాగా ఇంట్లోకి వచ్చి వృద్ధురాలితో మాటలు కలిపి ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసు వివరాలు అడగసాగారు. గొలుసును బయట ఉన్న తన వారికి చూపిస్తామని నమ్మించి మెడలో ఉన్న 6సవర్ల గొలుసు తీసి ఇచ్చేలోపే లాక్కొని పరారయ్యారు. ఆందోళన చెంది కేకలు వేయటంతో అక్కడ వున్న వారు సంఘటనా స్ధలానికి చేరుకొని పోలీసులకు సమాచారం అందించారు. పర్చూరు ఎస్ఐ రవిశంకర్‌రెడ్డి బోడవాడ వెళ్ళి వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వంటరిగా ఉన్న సమయంలో అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సూచించారు. కొత్త వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. బంగారం, నగదు, విలువైన వస్తువులు ఏవీ చూపించకూడదని చెప్పారు. అనుమానితులేవరైనా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కార్యాలయాలకు విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్న అధికారులు

కార్యాలయాలకు విద్యుత్ సౌకర్యం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని గుత్తావారిపాలెంలో ఉన్న జెడ్‌పి ఉన్నత పాఠశాల, మండల పరిషత్ పాఠశాల, పశువైద్యశాల, ఆర్బికెలలో విద్యుత్ సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో సర్పంచ్ నీళ్ల ఉషారాణి, మంత్రి నాగార్జున దృష్టికి తీసుకువెళ్లారు. విషయం తెలుసుకున్న మంత్రి నాగార్జున తక్షణం విద్యుత్ సౌకర్యం కల్పించాలని సంబంధిత విద్యుత్ డిఏని ఆదేశించారు. ఎక్స్ప్రెస్ ఫీడర్ మీద లైన్ కలిపి విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఆదేశించటంతో విద్యుత్ సిబ్బంది గ్రామంలోని గాజులపేట వద్ద ఎక్స్‌ప్రెస్ గడ్డలపై విద్యుత్ లైన్ కలపడంతో కార్యాలయానికి విద్యుత్ సౌకర్యం ఏర్పడిందని సర్పంచ్ ఉషారాణి తెలిపారు. మంత్రి చొరవతో ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయడం అభినందనీయమని కృతజ్ఞతలు తెలిపారు. విద్యుత్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైసిప నాయకులు నీల నాగరాజు, నీల రమేష్, కొనకాల శ్రీను, విద్యుత్తు లైన్‌మెన్ రవి, పంచాయతీ కార్యదర్శి చౌరీ జోషి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

9 వరకు అభ్యంతరాలకు అవకాశం

- పారదర్శకంగా సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా..
- కలెక్టర్ రంజిత్‌బాషా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

అత్యంత పారదర్శకంగా ప్రత్యేక సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా రూపొందిస్తున్నామని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. డిసెంబర్ 9వ తేదీ వరకు అభ్యంతరాలకు అవకాశం ఉందన్నారు. ప్రత్యేక సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితాపై గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించిన తదుపరి చేర్పులు, మార్పుల కొరకు అభ్యంతరాలపై దరఖాస్తులు స్వీకరిస్తున్నామని కలెక్టర్ చెప్పారు. 18 సంవత్సరాలు నిండి ఓటు హక్కు పొందడానికి అర్హులైన వారు సుమారుగా 60 వేల మంది ఉన్నట్లు అంచనా వేశామన్నారు. ప్రస్తుతం 12 వేల మంది మాత్రమే దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. మిగిలిన వారంతా దరఖాస్తులు చేసుకునేలా రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. ఇప్పటికే అన్ని కళాశాలలో ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. 1,44,782 దరఖాస్తులలో 1,13,035 దరఖాస్తులు విచారణ పూర్తయిందని, 18,988 దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయన్నారు. మిగిలిన 12,759 దరఖాస్తులు విచారణ పూర్తి చేసి ఆన్ లైన్ లో నిక్షిప్తం చేయాల్సి ఉందన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో 12,023 మంది ఓటర్ల ఫోటోలు రెండు పర్యాయాలు ప్రచురితమైనట్లు గుర్తించామన్నారు. వాటిని తొలగించే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. రాజకీయ పార్టీల సమక్షంలోనే ప్రతి కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో డిఆర్ఓ పి వెంకటరమణ, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు కష్ణ కాంత్, బిజెపి నాయకులు రామకష్ణ, సిపిఎం నాయకులు కోటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు డి రవి, బిఎస్పి నాయకులు కోటేశ్వరరావు, టిడిపి నాయకులు గౌస్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

డిఆర్ఒకు సమస్యను వివరిస్తున్న సిపిఎం నేతలు, బాధితులు

ఏసమ్మ మరణంపై

సమగ్ర విచారణ జరపండి

- బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి
-డిఆర్ఒను కోరిన సిపిఎం నగర కమిటీ నేతలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు జిజిహెచ్‌లో చనిపోయిన పొదిలి మండలం. తుమ్మగుంట గ్రామానికి చెందిన కుంచం ఏసమ్మ మరణంపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యత కుటుంబానికి న్యాయం చేయాలని సిపిఎం పార్టీ ఒంగోలు నగర కమిటీ నేతలు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం జిల్లా రెవెన్యూ అధికారి ఆర్.శ్రీలతను బాధితులతో కలసి వినతిపత్రం అందజేశారు. సిపిఎం నగర నాయకులు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఉన్న రిమ్స్ హాస్పిటల్ పేరుకు మాత్రమే 1000 పడకల ఆసుపత్రి అని, రోగులకు వైద్యం అందించడంలో వైద్యులు, నర్సులు రోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. సరైన వైద్యం అందించటం లేదని, మెరుగైన వైద్యం అందక చనిపోయిన కుంచం ఏసమ్మ కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలన్నారు. బాధ్యతారహితంగా వ్యవహరించిన వైద్యులపై తగిన చర్యలు తీసుకొని బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. 26 తేదీన కుంచం ఏసమ్మ చనిపోయిన విషయం కుటుంబ సభ్యులకు తెలియజేయకపోవటం, ఆమెను చూడడానికి ఎవరినీ పంపించకపోవడం దుర్మార్గమైన చర్యని తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, డ్యూటీ డాక్టర్లు, నర్సులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులతో పాటు సిపిఎం నగర కమిటీ సభ్యులు శ్రీరామ శ్రీనివాసరావు, ఎస్‌డి హుస్సేన్, కంకణాల రమాదేవి, అత్తింటి శ్రీనివాసులు, సిఐటియు నగర నాయకులు తేళ్ళ విజయమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా డిపిఆర్‌సి భవనం ప్రారంభం

కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సురేష్, ఎమ్మెల్యే బాలినేని

ప్రజాశక్తి- ఒంగోలు కలెక్టరేట్

జిల్లా ప్రజాపరిషత్‌లో అసంపూర్తిగా ఉన్న డిపిఆర్‌సి భవనాన్ని బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ఒంగోలు శాసనసభ్యులు బాలినేని శ్రీనివాస రెడ్డి ప్రారంభించారు. తొలుత డిపిఆర్‌సి భవనంలో జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా పరిషత్ కార్యాలయము ప్రస్తుతం ఉంటున్న భవనం విధులు నిర్వహించడానికి అనుకూలంగా లేక ప్రమాదకరంగా ఉన్న కారణంగా జిల్లా పరిషత్ అధ్యక్షురాలు బూచేపల్లి వెంకాయమ్మ అభ్యర్ధన మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కొత్త జిల్లా పరిషత్ భవన నిర్మాణానికి రూ. 20 కోట్లు మంజూరుకు హామీ ఇచ్చియున్నారు జిల్లా పరిషత్ కొత్త భవనం ఏర్పడే వరకు ఉద్యోగుల సంక్షేమం, భద్రత దష్ట్యా అసంపూర్తిగా ఉన్న డిపిఆర్‌సి భవనాన్ని ఆర్‌జిసిఎ నిధులు రూ.2 కోట్లు, జిల్లా పరిషత్ సాధారణ నిధులు రూ.1.40 కోట్లు మొత్తం రూ.3.40 కోట్లతో పూర్తి చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో జిల్లా ప్రజా పరిషత్ కొత్త నిర్మాణాలు, అభివృద్ధికి సిఎం చర్యలు చేపట్టారన్నారు. ఉద్యోగుల భద్రత దృష్ట్యా డిపిఆర్‌సి భవనం పూర్తి చేసుకోవటం సంతోషంగా ఉందని, వారు విధులు సక్రమంగా నిర్వహించేందుకు అవకాశం ఉందన్నారు. త్వరలోనే జడ్పీ కొత్త భవన నిర్మాణం పూర్తయి అందులోకి వెళ్ళాలని సూచించారు. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమానికి సిఎం ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. డిపిఆర్‌సి భవనం ప్రారంభించటం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, శ్రీ ఎ.యస్.దినేష్ కుమార్, జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్సీ చంద్ర శేఖర్ రెడ్డి, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, సంతనూతలపాడు ఎమ్మెల్యే టిజెఆర్‌సుధాకర్ బాబు, దర్శి మాజీ శాసన సభ్యులు శ్రీ బూచేపల్లి శివ ప్రసాద రెడ్డి, జడ్పీ వైస్ ఛైర్‌పర్సన్స్, జడ్పీటిసి సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

డిపిఆర్‌సి భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సురేష్, ఎమ్మెల్యే బాలినేని

ఆధునీకరించిన క్యాంపు కార్యాలయం ప్రారంభం

ఒంగోలు, సంతపేటలో ఆధునీకరించిన జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ క్యాంపు కార్యాలయాన్ని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి ప్రారంభించారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

సాంఘిక సంక్షేమ హాస్టల్స్‌లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో 10వ తరగతి చదువుతున్న 2125 బాలికలకు రు.17.00 లక్షలు విలువ గల స్టడీ మెటీరియల్ ను జిల్లా ప్రజా పరిషత్ సాధారణ నిధుల నుండి మంజూరు చేసి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే టిజెఆర్ సుధాకర్ బాబు, దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివ ప్రసాద్ రెడ్డి, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, జడ్పీటిసిలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

- డిఆర్ఒ ఆర్.శ్రీలత - ఉత్సాహంగా వికలాంగుల క్రీడా పోటీలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

క్రీడలు దేహదారుఢ్యానికి, మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని జిల్లా రెవెన్యూ అధికారణి ఆర్.శ్రీలత తెలిపారు. ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం డిఆర్ఆర్ మున్సిపల్ హైస్కూలు మైదానంలో వికలాంగులకు నిర్వహించిన క్రీడాపోటీలు ఉత్సాహంగా సాగాయి. కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ నేతత్వంలో క్రీడా పోటీలను వికలాంగులు, హిజ్రాలు, వయో వద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జి. అర్చన ఆధ్వర్యంలో నిర్వహించారు. క్రీడా పోటీలను ప్రారంభించిన డిఆర్ఒ ఆర్.శ్రీలత మాట్లాడుతూ వికలాంగులు సకలాంగులతో సమానంగా అన్ని రంగాలలో రాణిస్తున్నారన్నారు. వికలాంగత్వంపై కుమిలిపోకుండా ఆత్మస్థైర్యం నింపుకొని ముందుకు సాగాలన్నారు. వికలాంగుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. క్రీడా పోటీలలో అందరూ ఉత్సాహంగా పాల్గొనాలని ఆమె కోరారు. వికలాంగులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జి.అర్చన మాట్లాడులూ వికలాంగులలో మానసిక, శారీరక స్థైర్యం కల్పించేందుకు ప్రభుత్వం ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా ప్రతి ఏటా డిసెంబర్ 3న ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తుందని,. ఈ అవకాశాన్ని వికలాంగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం బధిరులు, అంధులకు పలు పోటీలను నిర్వహించారు. పరుగు పందెం, లాంగ్ జంప్, హై జంప్, షార్ట్ పుట్, డిస్కస్ త్రో, జావెలిన్ త్రో, చదరంగం ట్రై సైకిల్స్, బేస్, క్యారమ్స్, క్రికెట్, వాలీ బాల్ వంటి అంశాలలో పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో మైనారిటి కార్పోరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ధనలక్ష్మి, బిసి సంక్షేమాధికారి అంజల, డిఎల్‌డిఒ ఉషారాణి, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ జి.రాజరాజేశ్వరి, మైనారిటీ వెల్ఫేర్ అధికారి డాక్టర్ సునీల్ కన్నా, బధిరుల పాఠశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లుతో పాటు పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వికలాంగుల అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఆర్ఒ శ్రీలత

ట్రైసైకిళ్ల పోటీలో పాల్గొన్న చిన్నారులు